ప్రజాశక్తి

ఆదివారం 7 సెప్టెంబర్ 2025

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

కార్మిక వ్యతిరేక విధానాలపై

ఉధృత పోరాటాలు

- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు
- ఘనంగా సంఘం అనకాపల్లి జిల్లా మహాసభలు ప్రారంభం
- గోవాడ సుగర్ ఫ్యాక్టరీని ఆధునీకరించి, బకాయిలు విడుదల చేయాలని తీర్మానం



మాట్లాడుతున్న సిహెచ్.నర్సింగరావు, వేదికపై ఎవి.నాగేశ్వరరావు, లోకనాథం, శంకరరావు

ప్రజాశక్తి - చోడవరం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలపై రానున్న కాలంలో ఉధృత పోరాటాలు నిర్వహించాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు పిలుపునిచ్చారు. రెండు రోజులపాటు తలపెట్టిన సిఐటియు అనకాపల్లి జిల్లా 13వ మహాసభలు చోడవరంలోని గంగా ఫంక్షన్ హాల్‌లో శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సాహంగా, ఉత్తేజంగా సాగాయి. సంఘం రాష్ట్ర కార్యదర్శ జి.కోటేశ్వరరావు పతాకావిష్కరణ చేశారు. సంఘం సీనియర్ నాయకులు డి.సత్తిబాబు, మళ్ల సత్యనారాయణ, ఎ.బాలకృష్ణ, జయలక్ష్మిలకు, సీతారాం ఏచూరి, అచ్యుతానందన్‌కు, ఈ కాలంలో మరణించిన కార్మిక నాయకులకు మహాసభ శ్రద్ధాంజలి ఘటించింది. ఈ మహాసభలకు అధ్యక్ష వర్గంగా కె.లోకనాథం, గూనూరు వరలక్ష్మి, వి.వి.శ్రీనివాసరావు, దుర్గారాణి వ్యవహరించారు.

మహాసభకు ముఖ్య అతిథిగా హాజరైన సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ సరళీకరణ, ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా మొనగాడిగా సిఐటియు పోరాడు తోందన్నారు. మోడీ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఇటీవల చేపట్టిన సార్వత్రిక సమ్మెలో యావత్తు కార్మికవర్గం పాల్గొందన్నారు. సామాన్యులు, కార్మికులపై బిజెపి ప్రభుత్వ దాడిని తిప్పికొట్టేందుకు కార్మిక వర్గం మరింత మిగతా 2లో..



మాట్లాడుతున్న మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి

విశాఖ అభివృద్ధిపై దృష్టి

- సుందరీకరణ, విద్యుదీకరణ, పట్టణీకరణపై చర్యలు
- తాగునీరు, వీధి దీపాల సమస్యలను పరిష్కరిస్తాం
- డిఆర్‌సి సమావేశంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి డోలా

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : క్లీన్ సిటీ, స్మార్ట్ సిటీ అయిన విశాఖ మహా నగరం అభివృద్ధిపై అధికార యంత్రాంగం ప్రధాన దృష్టి సారించాలని, ఖ్యాతి మరింత పెరిగేలా పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి పేర్కొన్నారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని, సరైన కార్యాచరణతో ముందుకు వెళ్లాలని నిర్దేశం చేశారు. సుందరీకరణ, విద్యుదీకరణ, పట్టణీకరణ మరింత పెరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు. కలెక్టరేట్ మీటింగ్ హాలులో శనివారం జరిగిన జిల్లా సమీక్షా మండలి (డిఆర్‌సి) సమావేశంలో పలు అంశాలపై ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత సమావేశంలో లేవనెత్తిన సమస్యలను పరిష్కరించామని అన్నారు. తాగునీరు, వీధి దీపాల సమస్యపై ఈ సమావేశంలో చర్చించామని, ఆ సమస్యలను పరిష్కరిస్తామని పేర్కొన్నారు. వేసవిలో తాగునీటి సమస్య లేకుండా నీటిని నిల్వ చేసుకునే ట్యాంకుల కెపాసిటీ పెంచాలని మిగతా 2లో..

స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్టు కార్మికుడు మృతి

▶ వార్త 3లో..

ఇఒఐ పేరుతో 'ఉక్కు' అమ్మకం ఆపాలి

▶ వార్త 4లో..

ట్రంప్ సుంకాలపై వామపక్షాల నిరసన

▶ వార్త 8లో..

అందరికీ అందుబాటులో న్యాయం

- న్యాయవ్యవస్థలో డిజిటల్ అంతరాన్ని తగ్గించేందుకు చర్యలు
- జస్టిస్ రఘునందన్‌రావు



పోటా క్యాబిన్‌ను ప్రారంభిస్తున్న రఘునందన్ రావు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : అందరికీ న్యాయం అందుబాటులో ఉండేలా పలు చర్యలు చేపడుతున్నట్టు ఎపి హైకోర్టు పరిపాలనా న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు తెలిపారు. విశాఖపట్నం జిల్లా కోర్టు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ-సేవా (పోటా క్యాబిన్) కేంద్రాన్ని ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇ-కోర్టుల ప్రాజెక్టులో భాగంగా ఈ ఇ-సేవా కేంద్రం ఏర్పాటు చేయబడిందన్నారు. న్యాయవ్యవస్థలో డిజిటల్ అంతరాన్ని తగ్గించి, న్యాయం అందరికీ అందుబాటులో ఉండేలా చేయడమే దీని ప్రధాన లక్ష్యమని అన్నారు.

ఇటువంటి కేంద్రాలు ఉచిత న్యాయ సేవలను ఎలా పొందాలో ప్రజలకు మార్గ నిర్దేశం చేయడం, వీడియో కాన్ఫరెన్స్ కోర్ట్ విచారణను ఏర్పాటు చేయడం, న్యాయపరమైన ఆదేశాలు, తీర్పుల సాఫ్ట్ కాపీలను ఇమెయిల్, వాట్సాప్ లేదా అందుబాటులో ఉన్న ఏదైనా ఇతర మోడ్ ద్వారా అందించడం చేస్తాయన్నారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ చీమలపాటి రవి, జస్టిస్ చల్ల గుణరాజన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు, సిబ్బంది పాల్గొన్నారు.



మాడుగుల మండలం కెజె.పురం పిఎసిఎస్ వద్ద బారులు తీరిన రైతులు

యూరియా కోసం

అన్నదాతల అగచాట్లు

మండుటెండలో గంటల తరబడి నిరీక్షణ

వార్త 7లో..

మొదటి పేజీ తరువాయి..

విశాఖ అభివృద్ధిపై దృష్టి

నిర్ణయించామన్నారు. పోలవరం లెఫ్ట్ కెనాల్ నుంచి వచ్చే నీటిని రిజర్వ్ చేసుకునేందుకు వీలుగా అదనంగా కొన్ని ట్యాంకుల ఏర్పాటుకు చర్యలు తీసుకోబోతున్నామన్నారు. టిడ్కో ఇళ్ల సమస్యపై అసెంబ్లీ సమావేశాల సమయంలో సంబంధిత శాఖల ముఖ్య అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి చర్చించాలని తీర్మానం చేశామన్నారు. సచివాలయాలలో ప్రింటర్స్ కొరత ఉన్నట్లుగా డిఆర్‌సి సమావేశంలో చర్చకు వచ్చిందని, అందుకు సంబంధించి టెండర్స్ పిలిచి, త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. ప్రాజెక్టులను ముందుకు తీసుకువెళ్లే విషయంలో సమస్యలు తలెత్తకుండా కేంద్ర ప్రభుత్వ సంస్థలైన రైల్వే, పోర్టు, నేవల్, డాక్ యార్డ్ తదితర సంస్థల అధికారులు, జిల్లా రెవెన్యూ అధికారులతో ఒక కమిటీ ఏర్పాటు చేసి జిల్లా అభివృద్ధి విషయంలో మోనిటరింగ్ చేస్తామన్నారు. పారిశుధ్య కార్మికులు తక్కువగా ఉన్నందున తాత్కాలిక పద్ధతిలో సిబ్బందిని తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చినట్లు స్పష్టం చేశారు. విశాఖ జిల్లా పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతమని, ఆర్థికంగానూ, ఉపాధి కల్పించే విధంగానూ మరిన్ని ప్రణాళికలు రచిస్తామన్నారు. టూరిజం, క్లీన్ అండ్ గ్రీన్‌తోపాటు సౌకర్యాలు పెంచాలని ఈ సమావేశంలో తీర్మానించామని తెలిపారు. జిఒ నెంబర్ 30, 45 విషయంలో ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ముందుకు వెళ్లాలని సూచించామన్నారు. దీపం-2 పథకంలో లబ్ధిదారులకు ఎటువంటి సమస్యలున్నా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. విశాఖ నగర అభివృద్ధికి అధికారులకు ప్రజలు సహకరించాలని పిలుపునిచ్చారు. పోలవరంలో నీటిని నవంబర్‌కు అనకాపల్లి వరకు తీసుకొస్తామని తెలిపారు. సమావేశంలో డిసిసిబి చైర్మన్ కోన తాతారావు, శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ పాల్గొన్నారు.

లూలూకు భూ కేటాయింపులు రద్దు చేయాలి



నినాదాలు చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ సాగర తీరంలో లూలూ మాల్‌కు 13.74 ఎకరాల అత్యంత ఖరీదైన ప్రభుత్వ భూమిని కేటాయించడాన్ని విశాఖపట్నం ప్రజావనరుల పరిరక్షణ సమితి తీవ్రంగా తప్పుబట్టింది. ఆ కేటాయింపులను వెంటనే రద్దు చేసి ఆ స్థలంలో సైన్స్ సిటీని నిర్మించాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం నగరంలోని ఆర్‌కెబీచ్‌లో కరపత్రాల పంపిణి కార్యక్రమాన్ని నిర్వహించింది. ముందుగా వేదిక చైర్మన్ రాణిశర్మ కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్తులు, ఖజానాకు ధర్మకర్తగా ఉండాల్సిన ప్రభుత్వం రాష్ట్రంలో అత్యంత ఖరీదైన భూముల పందేరాన్ని నిలిపివేసి ఆ స్థలంలో సైన్స్ సిటీని నిర్మించాలని డిమాండు చేశారు. వేదిక కన్వీనర్‌లు డాక్టర్ సి.ఎన్.క్షేత్రపాల్‌రెడ్డి, ఎస్.వెంకటలక్ష్మి, ఎన్.ప్రతాప్, సిఐటియు జిల్లా నాయకురాలు పి.మణి తదితరులు మాట్లాడుతూ ప్రభుత్వ భూమి ఏదైనా సరే ప్రజల ప్రయోజనాలకే వినియోగించుకోవాలని హితవు పలికారు. తక్షణమే లులుకి భూమిని కేటాయిస్తూ ఇచ్చిన జిఒను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కూటమి సర్కారు అధికారం చేపట్టిన తరువాత నగరంలోని ప్రభుత్వ భూములు అన్నీ కార్పొరేట్ శక్తులకు అప్పనంగా కట్టబెడుతోందన్నారు. సిఆర్‌జెడ్ నిబంధనలన్నీ ఉల్లంఘించి సాగర తీరంలోని 13.94 ఎకరాల భూమిని లులుకు ఎలా కేటాయిస్తారని చంద్రబాబు ప్రభుత్వాన్ని నిలదీశారు. చదరపు అడుగుకి నెలకు రూ.1.50 చొప్పున ఏడాదికి రూ.4.51 కోట్లు ప్రభుత్వానికి లులు అద్దెకు ఇవ్వడం అంటే ప్రజల ఆస్తిని కార్పొరేట్లకు అప్పగించడమేనని మండిపడ్డారు. విలువైన భూములను కార్పొరేట్లకు పంచిపెడితే చూస్తూ ఊరుకోమని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ప్రజావనరుల పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు ఎం.మన్మథరావు, ఎం.పైడిరాజు, పౌర ప్రజా సంఘాల సమన్వయకర్త పి.చంద్రశేఖర్, ఎపి మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్సులు కె.వనజాక్షి, ఎం.డి.బేగం, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి యు.ఎస్.ఎన్ రాజు, ఎఐ ఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి యు.నాగరాజు,ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వై. రాంబాబు,బానాసా జిల్లా అధ్యక్షులు వై.నూకరాజు, కార్మిక నాయకుడు రవి, ఎ.దేవుడమ్మ తదితరులు పాల్గొన్నారు.

దళితులపై దాడి చేసిన వారిని శిక్షించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్: ఒడిశాలో దళితులపై దాడి చేసి ఒకరిని హతమార్చి, దౌర్జన్యానికి పాల్పడ్డ గోగుండాలను కఠినంగా శిక్షించాలని కెవిపిఎస్ విశాఖ జిల్లా అధ్యక్షులు ఎం.సుబ్బన్న, ప్రధాన కార్యదర్శి టి.చిరంజీవి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఒరిస్సా రాష్ట్రం దేవఘడ్ జిల్లా రియామల్ పోలీస్ స్టేషన్ పరిధిలోనీ కుడేజురీ గ్రామ అటవీ ప్రాంతంలో కౌన్సిదీప గ్రామ దళితులైన కిషోర్ చమర్, గౌతమ్ నాయక్ చర్మకార వత్తిదారులు, అనారోగ్యం కారణంగా చనిపోయిన పశువుల కళేబరం నుండి చర్మాన్ని వేరుచేస్తుండగా, గోగుండాలు దాడి చేసి కిషోర్ చమర్‌ను అతి దారుణంగా కొట్టి చంపారన్నారు. పశువులను తాము చంపలేదనీ చర్మకారులు ప్రాధేయపడినా వినకుండా గోగుండాలు చితకబాదడంతో కిషోర్ చమర్ అక్కడికక్కడే మృతిచెందారన్నారు.

తీవ్రంగా గాయపడిన గౌతంనాయక్ గోగుండాల నుంచి తప్పించుకొని గ్రామస్తులకు సమాచారం అందించారని తెలిపారు. పోలీసులు 6 గురు గోగూండాలను అదుపులోకి తీసుకున్నారని చెప్పారు. ఒడిశాలో గోగుండాల చర్యలను వారు తీవ్రంగా ఖండించారు. కేంద్ర,రాష్ట్ర బిజెపి ప్రభుత్వాలు చర్యలు తీసుకోకపోవడం వలనే ఇలాంటి చర్యలకు పదే,పదే పాల్పడుతున్నారని ఆరోపించారు. వారిని కఠినంగా శిక్షించాలని, గౌతమ్‌నాయక్‌కు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై ఉద్ధృత పోరాటాలు

(మొదటి పేజీ తరువాయి..)

చైతన్యవంతంగా ముందుకు సాగాలన్నారు. సమస్యల పరిష్కారానికి పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. పోరాడితేనే హక్కులు వస్తాయన్నారు. కార్మికులకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్‌ను తిప్పికొట్టాలన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం కార్మికులు చేస్తున్న పోరాటాన్ని ఆయన కొనియాడారు. అనకాపల్లి జిల్లాలో పారిశ్రామిక కేంద్రంలో కార్మికులు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారని, వారికి కనీస వేతనాలు దక్కడం లేదని అన్నారు. ఉద్యోగ భద్రత కరువైందని తెలిపారు. వలస కార్మికులకు చట్టం అమలు కోసం సిఐటియు కృషి చేస్తోందని తెలిపారు. రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం పి 4 పేరుతో పేదలను బంగారు కుటుంబాలుగా చేస్తానని, పెట్టుబడిదారుల ద్వారా అభివృద్ధి సాధిస్తానని చెప్పటం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాబోయే కాలంలో కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలపై పెద్ద ఎత్తున ఉద్యమాలకు సిఐటియు సిద్ధమవుతోందన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఉండే నాలుగు సుగర్ ఫ్యాక్టరీల్లో మూడు మూతపడ్డాయని, గోవాడ చక్కర కర్మాకారంలో క్రషింగ్ జరుగుతుందో లేదో అన్న అనుమానం తలెత్తుతోందని అన్నారు. రైతులు, కార్మికులు పెద్ద ఎత్తున పోరాటం చేస్తే తప్ప సహకార రంగంలో ఉన్న ఫ్యాక్టరీలను కాపాడుకోలేమన్నారు. సంఘం జిల్లా అధ్యక్షులు కె.లోకనాథం మాట్లాడుతూ అనకాపల్లి జిల్లాకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. పారిశ్రామికంగా ఎదిగే ఈ జిల్లాలో అనేక పరిశ్రమలతో పాటు వివిధ రకాల కంపెనీలు ఏర్పాటు కానున్నాయని, వీటన్నింటిలోనూ ఎంతో కార్మిక శక్తి అవసరం ఉంటుందన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటాలు నిర్వహించాలన్నారు. సరైన ఉద్యమ కార్యాచరణతో ముందుకు సాగాలన్నారు.


పతాకావిష్కరణ చేస్తున్న కోటేశ్వరరావు


అమరవీరులకు నివాళ్లర్పిస్తున్న నాయకులు

సభా ప్రాంగణానికి డి.సత్తిబాబు నగర్, మళ్ల సత్యనారాయణ ప్రాంగణం అని నామకరణం చేశారు. సభ ప్రారంభానికి ముందు అందరూ అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. ఈ మహాసభలకు జిల్లా నలుమూలల నుంచి 200 మంది ప్రతినిధులు వివిధ రంగాల నుంచి హాజరయ్యారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎవి.నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, ఆర్‌కెఎస్‌వి.కుమార్, అల్లూరి జిల్లా కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు, అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకరరావు, కోశాధికారి వివి.శ్రీనివాసరావు, జిల్లా నాయకులు ఆర్.రాము, గనిశెట్టి సత్యానారాయణ, ఎం.నాగశేషు, సిహెచ్.రూపాదేవి, వి.సత్యవతి, కె.త్రినాథ్, ఎ.రాజు, జి.దేవుడు నాయుడు, పరమేశ్వరరావు, ఎస్‌వి.నాయుడు, నాగిరెడ్డి సత్యనారాయణ, చంద్రరావు తదితరులు పాల్గొన్నారు. కార్యదర్శి నివేదికపై చర్చలు సాగాయి.



కోలాటంతో ఆకట్టుకున్న కళాకారులు

గోవాడ సుగర్స్‌పై తీర్మానం

గోవాడ సుగర్ ఫ్యాక్టరీని ఆధునికీకరించి కార్మికులు, రైతులు బకాయిలు వెంటనే చెల్లించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి గూనూరు వరలక్ష్మి తీర్మానం ప్రవేశ పెట్టారు. సహకార రంగంలో నడుస్తున్న ఏకైక సుగర్ ఫ్యాక్టరీని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోకపోతే ఈ ప్రాంత రైతాంగమంతా కుదేలవుతుందని రాష్ట్ర ప్రభుత్వం రూ.100 కోట్లను గ్రాంట్‌గా ఇచ్చి ఆధునీకరించాలని అన్నారు. రైతులు, కార్మికుల రూ.30 కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని తెలిపారు. ఈ తీర్మానాన్ని నాయకులు ప్రేమ చంద్రశేఖర్ బలపరచగా మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది

'అన్నదాత పోరు' పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : వైసిపి పార్టీ జిల్లా అధ్యక్షులు కెకె రాజు ఆధ్వర్యంలో యూరియా కొరత ఇతర రైతాంగ సమస్యలతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న రైతులకు బాసటగా, రాష్ట్ర వ్యాప్తంగా సెప్టెంబర్ 9న ఎరువుల బ్లాక్ మార్కెట్‌పై అన్నదాతపోరు రైతన్నకు బాసటగా వైసిపి పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా కె కె రాజు మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులు ఇక్కట్లు పడుతున్నారు. రైతు సమస్యలపై ఈ నెల 9న అన్నదాత పోరు" నిరసన కార్యక్రమం వైసిపి నిర్వహిస్తోందన్నారు. సమావేశంలో సమన్వయకర్తలు వాసుపల్లి గణేష్‌కుమార్, మొల్లి అప్పారావు, శాసన మండలి సభ్యురాలు వరుదు కళ్యాణి, మాజీ శాసన సభ్యులు చింతలపూడి వెంకట రామయ్య, పార్టీ కార్యాలయం పర్యవేక్షకులు రవిరెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్ గాంధి, రాష్ట్ర అనుబంధ విభాగల అధ్యక్షులు బొల్లవరపు జాన్ వెస్లీ తదితరులు పాల్గొన్నారు.

బహుజనగణమన పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : గ్రీన్‌పార్క్ హోటల్ దగ్గర జ్యోతిరావుపూలే, సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహాల వద్ద శనివారం ప్రముఖ రచయిత, కవి జూలూరి గౌరీశంకర్ రాసిన 'బహుజనగణమన' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ప్రొఫెసర్ చలం తదితరులు పాల్గొన్నారు.

15 నెలల్లోనే ప్రజల్లో వ్యతిరేకత

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ: 15 నెలల కాలంలో ఇంత ప్రజావ్యతిరేకత మూటగట్టుకున్న ప్రభుత్వం మరొకటి లేదని శాసనమండలి సభ్యురాలు, వైసిపి రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు వరదు కళ్యాణి విమర్శించారు. విశాఖ మహిళా విభాగం అధ్యక్షురాలు పేడాడ రమణికుమారి అధ్యక్షతన వైసిపి ఉత్తరాంధ్ర మహిళా విభాగం జోన్-1 సమావేశం విశాఖపట్నంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఈర్లే అనురాధ ఆధ్వర్యంలో మద్దిలపాలెం పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వరుదు కళ్యాణి మాట్లాడుతూ ఆడ బిడ్డ నిధి, నిరుద్యోగ భృతి పేరుతో మహిళలను, యువతను మోసం చేశారన్నారు. చెప్పారు. జెడ్‌పి ఛైర్‌పర్సన్ సుభద్ర పాల్గొన్నారు.

మధురవాడలో ప్రాజెక్టులపై గంటా సమీక్ష

ప్రజాశక్తి-మధురవాడ : మధురవాడ జోన్‌లో జివిఎంసి చేపట్టనున్న ప్రధాన ప్రాజెక్టులపై ఇంజినీరింగ్ అధికారులతో శనివారం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పదేళ్ల పాటు రోడ్లు, ఫుట్ పాత్‌లు, వీధిలైట్లు, గ్రీనరీ తదితరాలను నిర్వహించే కేరళ ప్రైవేట్ మోడల్‌ను జివిఎంసిలో అమలు చేయనున్న నేపథ్యంలో అత్యధికంగా రాకపోకలు సాగించే రోడ్లను గుర్తించాలన్నారు. జోన్ పరిధిలోని కొమ్మాది, పిఎం.పాలెం డబుల్ రోడ్లు సహా కైలాసగిరి - తిమ్మాపురం, లా కాలేజీ - ఐటి సెజ్, మిధిలాపురి లే-అవుట్ - హరిత, మారికవలస - కాపులుప్పాడ వరకూ మొత్తం 27 కిలో మీటర్ల పొడవున రోడ్లను మొదటి దశలో గుర్తించినట్టు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శాంతిరాజు వివరించారు. ప్రధాన రోడ్ల నిర్వహణలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు.

3 ఫ్లోర్లుగా జోనల్ ఆఫీస్

లా కాలేజీ రోడ్డులో ఎకరం స్థలంలో మధురవాడ జోనల్ ఆఫీస్ నిర్మాణానికి చేసిన ప్రతిపాదనలను ఎమ్మెల్యే పరిశీలించి పలు సూచనలు చేశారు. 3 ఫ్లోర్లుగా నిర్మించనున్న జోనల్ ఆఫీస్‌లో స్టిల్ట్ ఫ్లోర్ పార్కింగ్‌కు కేటాయిస్తారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో శానిటేషన్, రెవిన్యూ విభాగాలు, ఫస్ట్ ఫ్లోర్‌లో ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, జోనల్ కమిషనర్ ఆఫీస్, సెకండ్ ఫ్లోర్‌లో 600 మంది కెపాసిటీ గల మీటింగ్ హాల్, క్యాంటీన్, గ్రీన్ రూమ్‌లను నిర్మించనున్నారు.



ప్లాన్లను పరిశీలిస్తున్న గంటా శ్రీనివాసరావు

ఎండాడ హాకర్ల కోసం షాపింగ్ కాంప్లెక్స్

ఎండాడ మెయిన్ రోడ్డు వెంబడి ఉన్న హాకర్ల కారణంగా ట్రాఫిక్ జామ్ అవుతున్న నేపథ్యంలో వారికి ప్రత్యామ్నాయం చూపించి అక్కడి నుంచి ఖాళీ చేయించాలని గతంలో గంటా శ్రీనివాసరావు ఆదేశించారు. సమీపంలోని జివిఎంసి చెందిన 3 వేల గజాల స్థలంలో వాణిజ్య సముదాయాన్ని నిర్మించి హాకర్లకు కేటాయించాలని చేసిన సూచన మేరకు భవనాన్ని జి ప్లస్ 2గా డిజైన్ చేశారు. మూడు ఫ్లోర్లుగా నిర్మించనున్న ఈ సముదాయంలో హాకర్లకు కింద ఫ్లోర్ కేటాయించి, పై రెండు ఫ్లోర్లు వ్యాపార కార్యకలాపాల కోసం వదులుతారు.

చంద్రంపాలెం బ్రిడ్జి నిర్మాణానికి సహకరించండి

చంద్రంపాలెం ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి మెట్రో సంస్థ అభ్యంతరం తెలియజేసిందని ఇంజినీరింగ్ అధికారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో మెట్రో ఎండీ ఎన్‌పి.రామకృష్ణారెడ్డితో గంటా శ్రీనివాసరావు ఫోన్‌లో మాట్లాడారు. చంద్రంపాలెం హైస్కూల్లో 3 వేల మందికి పైగా చదువుతున్న విద్యార్థులు రోడ్డు క్రాస్ చేసినప్పుడు ప్రమాదాల బారిన పడుతున్నారని.. ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం అత్యావశ్యకమని వివరించారు. సాంకేతిక అంశాలను అధ్యయనం చేసి బ్రిడ్జి నిర్మాణానికి సహకరిస్తామని మెట్రో ఎండీ హామీ ఇచ్చారు.

విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి-ఆనందపురం : మండలంలోని గంభీరం పంచాయతీ పరిధి ఐఐఎం రోడ్డులో హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యాన ఇటీవల నిర్వహించిన హెరిటేజ్ ఫెస్ట్ - 2025 విజేతలకు శనివారం ఆ సంస్థ అధ్యక్షులు నిష్కించిన భక్తదాస బహుమతులు ప్రదానం చేశారు. చిత్రలేఖనం, పౌరాణిక వేషధారణ, గీతా శ్లోక పఠనం, గాత్ర సంగీతం, నాటకములు, శాస్త్రీయ నృత్యం, కుండల పెయింటింగ్, పేపర్ క్రాఫ్ట్ వంటి విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 36 పాఠశాలల 2600 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతీ విభాగంలో ప్రథమ, ద్వితీయ బహుమతులను అందజేశారు.

లక్ష్యం ఉన్నతంగా ఉండాలి

జెఎన్‌టియు కళాశాల విసి రాజ్యలక్ష్మి

ప్రజాశక్తి -తగరపువలస : ఎంచుకున్న లక్ష్యం ఉన్నతంగా ఉండాలని విజయనగరం జెఎన్‌టియు కళాశాల వైస్ ఛాన్సలర్ డాక్టర్ డి.రాజ్యలక్ష్మి విద్యార్థులకు సూచించారు. స్థానిక అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో 2025 - అచీవర్స్ డే శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ముఖ్య అతిథి రాజ్యలక్ష్మి మాట్లాడుతూ, ఉన్నత స్థాయికి వెళ్లాలన్న లక్ష్యాన్ని విద్యార్థులు కలిగి ఉండాలన్నారు. రాబోయే తరాలకు స్ఫూర్తిగా నిలవాలని విద్యార్థులను కోరారు. అవంతి ఇంజినీరింగ్, ఫార్మసీ కళాశాలలో 2025లో చదువు పూర్తి చేసి వివిధ సంస్థలు, కంపెనీల్లో ఉద్యోగాలు పొందిన 1110 మందిని ఆమెతో పాటు అవంతి విద్యా సంస్థల చైర్మన్, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు అభినందించారు. వారందరికీ ముత్తంశెట్టి అపాయింట్‌మెంట్ లెటర్లు అందించారు. ఈ సందర్భంగా ముత్తంశెట్టి మాట్లాడుతూ, రంగం ఏదైనా సరే పట్టుదల, నిబద్ధత కలిగి ఉండాలన్నారు. తద్వారనే విజయం సాధ్యమని స్పష్టం చేశారు. ప్రతికూల పరిస్థితులను కూడా అనుకూలంగా మలుచుకోవాలన్న తపన ఉంటే విజయం మన సొంతం అవుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ఆత్మ విశ్వాసం కలిగి ఉండాలని స్పష్టం చేశారు. అనంతరం ముఖ్య అతిథి, అతిథులను ముత్తంశెట్టి ఘనంగా సన్మానించారు. అవంతి విద్యా సంస్థల ప్రిన్సిపాల్స్, డైరెక్టర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గురువులకు సన్మానం



రిటైర్డ్ హెచ్‌ఎం సింహాచలాన్ని సన్మానిస్తున్న విశ్రాంత ఉద్యోగులు

ప్రజాశక్తి- యంత్రాంగం

సీతమ్మధార : అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీలోని జివిఎంసి ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులందరికీ ప్రధానోపాధ్యాయులు జయంతి రాధా కుమారి దుస్సాలువాలు, నూతన వస్త్రాలతో సత్కరించారు. చిత్రకళాఖండాన్ని మెమోంటును బహుకరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సునీత, గ్లోరీ, శ్యామల పాల్గొన్నారు

ములగాడ : ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆంధ్ర యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమంలో అవార్డు అందుకున్న బండారు శ్రీను మాస్టర్‌కు తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

భీమునిపట్నం : జివిఎంసి ఒకటో జోన్ పరిధిలో పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయునిగా, హెచ్‌ఎంగా సుదీర్ఘకాలంగా పనిచేసిన చెట్టి సింహాచలాన్ని భీమిలిలో శనివారం పలువురు విశ్రాంత ఉద్యోగులు సన్మానించారు. ఉద్యోగ విరమణ పొంది ఏడాది కావస్తున్నప్పటికీ ఇప్పటికీ ఆయన సహచర ఉపాధ్యాయులకు తోచిన రీతిలో సహాయ సహకారాలు, సూచనలు అందిస్తుండడం అభినందనీయమని ప్రశంసించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు టి.భీమారావు, ఆనందరావు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు పాల్గొన్నారు.

పద్మనాభం : పద్మనాభం మండల కాంప్లెక్స్ ప్రాంగణంలో గురుపూజోత్సవాన్ని పరిష్కరించుకొని శనివారం ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా 40 మంది ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపిపి కె.రాంబాబు, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ఎస్.గిరిబాబు, ఎంపిడిఒ ఎం.విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆనందపురం : ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వచ్ఛంద సేవకులు కొట్యాడ సత్యమూర్తి, చందక సూరిబాబు ఆధ్వర్యంలో 44 మంది ఉపాధ్యాయులను సత్కరించి మెమోంటోలు అందజేశారు. హైస్కూల్ ఉపాధ్యాయులతో పాటు ఆనందపురం, పొడుగుపాలెం, దొంతలవారి కల్లాలు, వేములవలస ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులను కూడా సన్మానించారు. ఆయా కార్యక్రమాల్లో ఎస్.నరసింహమూర్తి, బి.పద్మజారవిబాబు, సునీత, బంటుపల్లి లక్ష్మి, వై.భాస్కరరావు, గంగాధరుడు పాల్గొన్నారు.

గాజువాక : నడుపూరులో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యాన ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులతో కలిసి ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన బి.రామచంద్రనాయుడును సత్కరించారు. జన విజ్ఞాన వేదిక సైన్స్ అభివృద్ధికి ఎంతో కృషి చేస్తోందని, ఉపాధ్యాయులు అందరూ జనవిజ్ఞాన వేదికలో భాగస్వాములు కావాలని జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి ఎస్‌వికె.పరుశురాం పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెవివి గాజువాక కార్యదర్శి ఎం.సింహాచలం, పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్‌ఎం రాజకుమార్ పాల్గొన్నారు.

ఎస్.రాయవరం : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు డాక్టర్ అలమండ రామాచార్యులు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన నేపథ్యంలో శనివారం పాఠశాలలో ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రామాచార్యులు మాట్లాడుతూ ఈ అవార్డు తన బాధ్యతను మరింత పెంచిందన్నారు.



ఆనందపురం పాఠశాలలో జ్ఞాపికలతో ఉపాధ్యాయులు

నర్సీపట్నం: నర్సీపట్నం మండల పరిషత్ పాఠశాలలో పనిచేస్తున్న పిఆర్టియు జిల్లా అధ్యక్షులు డి గోపీనాథ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేష్ చేతుల మీదుగా టీచర్స్ డే సందర్భంగా రాష్ట్రస్థాయి అవార్డు, ప్రశంస పత్రాన్ని అందుకున్నారు, జిల్లా వ్యాప్తంగా వివిధ పాఠశాలల్లో పనిచేసి పాఠశాలల, సంఘ అభివృద్ధికి కషి చేయడంతో పాటు చిన్నారులకు విలువలతో కూడిన విద్యను అందించడంలో తన వంతు ప్రయత్నించేవారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవార్డు అందజేయడం సంతోషకరంగా ఉందని అన్నారు.



గోపీనాథ్‌కు ప్రశంసాపత్రం అందజేస్తున్న సిఎం

నేరాలు ఘోరాలు

స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్టు కార్మికుడు మృతి

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ స్టీల్‌ప్లాంట్ సిడిసిపి విభాగంలో శనివారం ఉదయం జరిగిన ప్రమాదంలో ఒక కాంట్రాక్టు కార్మికుడు మృతి చెందాడు. స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు, పోలీసుల కథనం ప్రకారం... స్టీల్‌ప్లాంట్‌లో మల్టీ టెక్ కాంట్రాక్టర్ వద్ద సిహెచ్.అప్పలనాయుడు పనిచేస్తున్నాడు. సిడిసిపి విభాగంలో శనివారం ఎత్తుగా ఉన్న ప్రదేశంలో పనిచేసి కిందికి దిగుతున్న సమయంలో ఎంఎస్ చక్కెర ప్లేట్ నట్లు ఊడిపోవడంతో కింద పడిపోయాడు. తలకి బలమైన గాయమై రక్తస్రావం కావడంతో ఫస్ట్ ఎయిడ్ విభాగానికి పంపించారు. అక్కడి వైద్యులు మెరుగైన చికిత్స కోసం తీసుకెళ్లాలని చెప్పడంతో అంబులెన్స్‌లో తరలిస్తుండగా మార్గమధ్యంలో అప్పలనాయుడు మృతిచెందాడు. మృతుని కుటుంబం పెదగంట్యాడ పరిధి నడుపూరులో కుటుంబంతో నివాసముంటున్నాడు. భార్య శ్రీదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కార్మిక సంఘాల నేతలు కాంట్రాక్టర్‌తో చర్చలు జరిపారు. రూ.2 లక్షలను రెండు రోజుల్లోగా కార్మికుని కుటుంబానికి చెల్లించడానికి కాంట్రాక్టర్ అంగీకరించాడు.

గత రెండు నెలల కాలంలో భద్రత లేని కారణంగా ఆరుగురు కాంట్రాక్టు కార్మికులు మృతి చెందారని స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మిక సంఘాల నాయకుడు నమ్మి రమణ ఆవేదన వ్యక్తం చేశారు. స్టీల్ ప్లాంట్ యాజమాన్యం భద్రతా చర్యలు చేపట్టకపోవడం వల్ల ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇప్పటికైనా భద్రత చర్యలు చేపట్టాలని కోరారు.

వ్యక్తి గల్లంతు

ప్రజాశక్తి-చోడవరం : మండలంలోని గజపతినగరం గ్రామ వద్ద శారదా నదిలో శనివారం అదే గ్రామానికి చెందిన పెంటకోట రమణ (62) నదీ ప్రవాహంలో గల్లంతయ్యాడు. నది అవతల వడ్డున కల్లాలు ఉండటంతో అక్కడికి వెళ్లడానికి నదిలోకి దిగడంతో గల్లంతయ్యాడు. దీంతో చోడవరం ఫైర్ సిబ్బంది గ్రామానికి చెందిన కొంతమంది యువకులు గాలింపు చర్యలు చేపట్టారు.

శారదానదిలో దూకిన యువతి

- గాలిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : అనకాపల్లి గవరపాలెం ప్రాంతానికి చెందిన ఓ యువతి శనివారం స్థానిక శారదనదిలో దూకింది. సమాచారం అందుకున్న పోలీసులు సిఐ విజయ్ కుమార్, ఎస్సై అల్లు వెంకటేశ్వరరావు ఆధ్వర్యాన హుటా హుటిన సంఘటనా స్థలానికి చేరుకొని గాలింపు చర్యలు ముమ్మరంగా చేపట్టారు. ఈతగాళ్లతో వెతికించినా ఆచూకీ లభించలేదు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. గాలింపు చర్యలపై అధికారులతో మాట్లాడారు. ఈ విషయం తెలియడంతో శారదనది వద్దకు అత్యధిక మంది చేరుకున్నారు.

భవన నిర్మాణ కార్మికునికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని ఏఎల్.పురంలో భారీ భవనం నిర్మాణ పనులు చేస్తున్న కార్మికుడు పాంగి రాజారావు(40) కాలు జారి కింద పడి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన శుక్రవారం జరగడంతో మెరుగైన వైద్యం కోసం హుటాహుటిన విశాఖపట్నం కేజిహెచ్‌కి తరలించారు. ఒక వ్యాపారి జీప్లస్3 భవన నిర్మాణం స్లాబ్ వేసే సమయంలో విజయనగరం జిల్లా వేపాడ మండలానికి చెందిన పాంగి రాజారావు ప్రమాదానికి గురయ్యాడు. గాయాల పాలైన కార్మికుడు కేజిహెచ్‌లో ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడు. ఈ ఘటనపై కృష్ణదేవిపేట పోలీసులు బాధితున తరపున స్టేట్మెంట్ నమోదు చేశారు.

స్తంభాన్ని ఢీకొన్న కారు

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలో ఒడ్డిమెట్ట జాతీయ రహదారిపై శనివారం పెద్ద ప్రమాదం తప్పింది. విశాఖపట్నం నుండి విజయవాడ వైపు కారులో భార్యాభర్తలు, ఇద్దరు పిల్లలు కలిసి ప్రయాణిస్తుండగా ఒడ్డిమెట్ట వద్దకు వచ్చేసరికి కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న స్తంభాన్ని ఢీకొంది. కారు ఒక్కసారిగా పైకి లేచింది. ఈ ప్రమాదంలో భార్యాభర్తలు స్వల్ప గాయాలతోను, పిల్లలు సురక్షితంగా బయటపడడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ ప్రమాదంలో కారు దెబ్బతింది.

ఘనంగా అనంతుని వ్రతాలు

ప్రజాశక్తి -పద్మనాభం : మండల కేంద్రమైన పద్మనాభంలోని అనంతపద్మనాభ స్వామి వ్రతాలు శనివారం వేడుకగా నిర్వహించారు. ఏటా భాద్రపద శుక్ల చతుర్దశి రోజున అనంత పద్మనాభ స్వామి వ్రతాలను దేవాలయంలో ఆనవాయితీ ప్రకారం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా తెల్లవారుజామున 5 గంటల నుంచి కొండపైన అనంత పద్మనాభ స్వామి దేవాలయంలోనూ, కొండకు దిగువన ఉన్న కుంతి మాధవస్వామి ఆలయంలోనూ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గోత్రనామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు.

సమాజాభివృద్ధిలో జర్నలిస్టుల పాత్ర కీలకం

ప్రజాశక్తి-సీతమ్మధార : సమాజాభివృద్ధిలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమైనదని వాసవి క్లబ్ వాల్తేర్ కపుల్స్ ప్రతినిధులు ఐఆర్‌కె.ప్రసాద్, గ్రంథి సత్యవాణి కొనియాడారు. వాసవి క్లబ్ వాల్తేర్ కపుల్స్ ఆధ్వర్యాన ఉత్తమ జర్నలిస్టులను శనివారం సత్కరించారు. వాసవి వీక్‌లో భాగంగా జరిగిన ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ, నగరంలో సుదీర్ఘ అనుభవం కలిగిన బ్యూరో చీఫ్‌లు, జర్నలిస్టులు, ఫొటో జర్నలిస్టు, డెస్క్ జర్నలిస్టులను క్లబ్ తరపున సత్కరించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అనంతరం సూపర్ సీనియర్ జర్నలిస్ట్ బొల్లం కోటీశ్వరరావు, డెస్క్ జర్నలిస్ట్ దొడ్డి జనార్ధనరావు, సీనియర్ కెమెరామెన్ ఎం.దేవత్రినాథ్, ఫొటో జర్నలిస్టు ఆలపాటి శరత్‌కుమార్, సీనియర్ మహిళ జర్నలిస్టు, బ్యూరో చీఫ్‌లు రాణి దేవెళ్ళ, ఎస్.అనూరాధ, ఇతర సీనియర్ జర్నలిస్టులు చిటిక రెడ్డి వెంకటరమణ, యర్రా నాగేశ్వరరావు, నమ్మి చంద్రమౌళి, కింతాడ మదన్‌ను సత్కరించారు. కార్యక్రమంలో భాగంగా నిరుపేద విద్యార్థులకు చెక్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ వాల్తేర్ కపుల్స్ ప్రతినిధులు మద్దుల సునీల్ గుప్త, తవ్వ సంపత్, బొడ్డు రాజేష్ బాబు, గ్రంథి రమేష్ పాల్గొన్నారు.

నగరాల కార్పొరేషన్ డైరెక్టర్ల నియామకాలు

ప్రజాశక్తి -యంత్రాంగం


గంటాను కలిసిన నాయకులు

మధురవాడ : నగరాల కార్పొరేషన్ డైరెక్టర్ల జాబితాలో విశాఖకు చెందిన పలువురు నాయకులకు పదవులు వరించాయి. ఏడో వార్డు నుంచి విశాఖ పార్లమెంటరీ పార్టీ కార్యదర్శిగా ఉన్న నాగోతి సూర్యప్రకాష్ (టిడిపి), అదే వార్డు నుంచి బిజెపి ఒబిసి రాష్ట్ర ఎగ్జి క్యూటివ్ సభ్యులు పోతిన పైడిరాజు, 5వ వార్డు నుంచి టిడిపి సీనియర్ మహిళా నాయకులు నాగోతి అనితకు డైరెక్టర్ పదవులు దక్కాయి. తమకు పదవులు కల్పించిన ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లకు కృతజ్ఞతలు తెలిపారు.

భీమునిపట్నం : జివిఎంసి నాలుగో వార్డు కె.నగరపాలెంపాలెం గ్రామానికి చెందిన పోతిన అప్పలరాజు ఎపి నగరాల వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును ఎంవిపి.కాలనీలో అప్పలరాజు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాసి నరసింగరావు, త్రినాధరావు పాల్గొన్నారు.



ములగాడ : ఏపీ నగరాల వెల్ఫేర్ డైరెక్టర్‌గా 61వ వార్డు టిడిపి అధ్యక్షుడు మజ్జి సోమేష్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా మజ్జి సోమేష్ మాట్లాడుతూ, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు కృషితో తనకు ఈ పదవి దక్కిందని చెబుతూ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ పదవికి న్యాయం చేకూరుస్తానని పేర్కొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-యంత్రాంగం

సీతమ్మధార : జివిఎంసి 41వార్డు పరిధిలో రూ.94.15లక్షలతో పలు అభివృద్ధి పనులకు దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అనంతరం ఆయన మాట్లాడుతూ, 41వార్డు పరిధిలోని సుబ్బలక్ష్మినగర్, దొండపర్తి జంక్షన్ పరిసర ప్రాంతాల్లో 74.30లక్షల నిధులతో తారు రోడ్డు, సిసి రోడ్డు, సిసి కాలువ, కల్వర్టు నిర్మాణాలు, రూ.19.85లక్షలతో బాబు కాలనీలో సిసి.రోడ్డు, సిసి.కాలువ, హోలీ క్రాస్ వీధిలో సిసి కల్వర్టు నిర్మాణాలు చేపట్టనున్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో వార్డులో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామని చెప్పారు. ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ శ్రీధర్, కూటమి నాయకులు ఆంథోని శేఖర్, సంజీవరావు, బానోజీరావు తదితరులు పాల్గొన్నారు.

అండర్ పాత్ రోడ్డు పనులకు శంకుస్థాపన

గోపాలపట్నం : జివిఎంసి 90వ వార్డు పరిధి ఎన్ఎడి కొత్త రోడ్డులో సుమారు రూ.12.50 లక్షల వ్యయంతో నిర్మాణం కానున్న అండర్ పాత్ రోడ్డు పనులకు ప్రభుత్వ విప్ గణబాబు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో వీఎంఆర్‌డిఎ అధికారులు, జోన్ 8 కమిషనర్ హేమలత, టిడిపి కార్పొరేటర్లు బొమ్మిడి రమణ, దాడి వెంకట రమేష్, శరగడం రాజశేఖర్, కూటమి నేతలు పాల్గొన్నారు.


అండర్ పాత్ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గణబాబు

ఇఒఐ పేరుతో స్టీల్‌ప్లాంట్ అమ్మకం ఆపాలి

సిపిఎం విస్తృత ప్రచారం



అప్పన్న కాలనీలో పాదయాత్రలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న జగ్గునాయుడు

ప్రజాశక్తి- యంత్రాంగం

ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రస్ట్ (ఇఒఐ) పేరుతో విశాఖ స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని ప్రభుత్వాలు ఆపాలని, సొంత గనులు కేటాయించాలని, చట్ట విరుద్ధంగా తొలగించిన 5 వేల మంది కాంట్రాక్టు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని, వీరి స్థానంలో ఇతర రాష్ట్రాల కార్మికుల నియామకం ఆపాలని, ప్లాంట్‌లోని 6 వేల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలని, నిర్వాసితులకు పర్మినెంట్ ఉద్యోగాలు ఇవ్వాలని, కార్మిక పోరాటాలు, దీక్షలపై కూటమి ప్రభుత్వ పోలీస్ నిర్బంధం నిలిపివేయాలని, ఉద్యోగులకు, కార్మికులకు పూర్తి జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సిపిఎం విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యాన ఈ నెల 11వ తేదీన సాయంత్రం 5 గంటలకు పాతగాజువాకలో నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరుతూ నగరంలో శనివారం విస్తృప్రచారం నిర్వహించారు.

గాజువాక : జివిఎంసి 68వ వార్డు పరిధి అప్పన్నకాలనీలో సిపిఎం ఆధ్వర్యాన పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్‌లో పనిచేస్తున్న 5000 మంది కాంట్రాక్టు కార్మికులను తొలగించడం అన్యాయమన్నారు. ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను నరేంద్ర మోడీ, చంద్రబాబు, పవన్ కల్యాణ్ కలిసి అమ్మాలని చూడడం దుర్మార్గమన్నారు. స్థానిక ఎమ్మెల్యే ప్రెస్ మీట్ పెట్టి స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ అవలేదని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ప్లాంట్ కోసం ప్రకటించిన ప్యాకేజీ డబ్బులను జిఎస్‌టి, బ్యాంకుల పేరుతో లాగేసుకున్నారని తెలిపారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ కార్మికులకు అన్యాయం జరుగుతుంటే స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. గాజువాకలో జరిగే బహిరంగను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు, నాయకులు ఎల్.బంగారునాయుడు, గొలగాని అప్పారావు, శ్రీనివాస్, ఎ.లోకేష్, కె.సంతోషం, జి.కృష్ణ, మహేష్, బి.అప్పారావు, సింహాచలం పాల్గొన్నారు.


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఐద్వా నాయకులు

కరాస : జివిఎంసి 52 వార్డు పరిధిలో కంచరపాలెం జోన్ కమిటీ సమావేశం హస్మి భవనంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బి.పద్మ మాట్లాడుతూ, ఇఒఐ పేరిట స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరించే కుట్ర జరుగుతోందని అన్నారు. ఈ నేపథ్యంలో బిజెపి, టిడిపి కూటమి ప్రభుత్వ విధానాలను ప్రజలకు తెలియజెప్పేందుకు పాదయాత్రలు, ప్రచారం చేపడుతున్నామని తెలిపారు. స్త్రీ శక్తి పేరుతో మహిళలకు ఉచిత ప్రయాణంతోపాటు, అదనంగా బస్సుల సంఖ్యను పెంచాలని తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్ష కార్యదర్శులు కె.హేమలత, కె.లక్ష్మీదుర్గ, సుమిత్ర, బొట్టా ఈశ్వరమ్మ, జయలక్ష్మి, మృదుల, గీత పాల్గొన్నారు.

ములగాడ : జివిఎంసి 60వ వార్డు పరిధి ఎంఐజి 63వ వార్డు చింతలలోవలో సిపిఎం ఆధ్వర్యాన పాదయాత్ర నిర్వహించారు. సిపిఎం మల్కాపురం జోన్ నాయకులు ఆర్.లక్ష్మణమూర్తి, కె.పెంటరావు మాట్లాడుతూ, విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ఇఒఐ పేరుతో ఆమ్మకానికి మోడీ ప్రభుత్వం పూనుకుంటే రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అడ్డుకోకపోవడం దూర్మార్గం అన్నారు. ఈ కార్యక్రమంలో వి.నీలయ్య రాజు, ఈశ్వరరావు, సత్యారావు, నరేష్, వాసు, గంగాధర్, రాంబాబు, సూరిబాబు, దుర్గరావు, సురేష్, హేమంత్ కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్.లక్ష్మణమూర్తి

కొమ్మాది : స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని వ్యతిరేకిస్తూ కొమ్మాది ప్రాంతంలోని స్వతంత్రనగర్, గాయత్రీనగర్, ఎస్‌సి.కాలనీ, లక్ష్మీవానిపాలెం తదితర ప్రాంతాలలో పాదయాత్ర నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ నెల 11వ తేదీన పాత గాజువాకలో నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు డి.అప్పలరాజు, సిహెచ్.శేషుబాబు, ఎస్.రామప్పాడు, డి.సూరిబాబు, కె.నాగరాజు, కె.అర్జునమ్మ, బి.సూరిబాబు, బి.అదిలక్ష్మి, ఉమ తదితరులు పాల్గొన్నారు

ఆరిలోవ : సిపిఎం ఆరిలోవ జోన్ కమిటీ ఆధ్వర్యాన 10వ వార్డు పరిధి ఎస్ఐజి.నగర్‌లో పాదయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి.మణి, జిల్లా కమిటీ సభ్యులు వి.నరేంద్రకుమార్, నాయకులు ఎ.రమణ, పి.వెంకట్రావు, పాల్గొన్నారు.



కొమ్మాది ప్రాంతంలో పాదయాత్ర చేస్తున్న నాయకులు



ఆరిలోవలో పాదయాత్ర చేస్తున్న సిపిఎం నాయకులు

శంకర్ ఫౌండేషన్‌కు ఫండస్ కెమెరా విరాళం

ప్రజాశక్తి- వేపగుంట : శంకర్ ఫౌండేషన్‌కు రూ. 10 లక్షల విలువైన అత్యాధునిక ఫండస్ కెమెరాను కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా బ్యాంక్ ఆఫ్ ఇండియా విరాళంగా ఇచ్చింది. ఫౌండేషన్ దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని బ్యాంక్ ఆఫ్ ఇండియా ఈ విరాళాన్ని అందించారని శంకర్ ఫౌండేషన్ డిజిఎం కె.బంగార్రాజు తెలిపారు. కొత్తగా ఏర్పాటుచేసిన సౌకర్యాన్ని బ్యాంకు ఆఫ్ ఇండియా జోనల్ మేనేజర్ నికేష్‌కుమార్ సిన్హా ప్రారంభించారు. బ్యాంకు ఆఫ్ ఇండియా సహకారానికి శంకర్ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ ఎ.కృష్ణకుమార్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కె.రాధాకృష్ణన్, వి.రవిశంకర్, ఎన్.సీతారాం, సామ్సన్ జోసెఫ్, వి.రమేష్‌కుమార్, కెవి వేణుగోపాల్ పాల్గొన్నారు.


ఫండస్ కెమెరాను ప్రారంభిస్తున్న నికేష్ కుమార్ సిన్హా

అప్పన్నను దర్శించుకున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తి

ప్రజాశక్తి- వేపగుంట : సుప్రీంకోర్టు న్యాయమూర్తి సూర్యకాంత్ సింహాచలంలోని శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామిని శనివారం దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన న్యాయమూర్తికి ఆలయ కార్యనిర్వహణాధికారి వేంద్ర త్రినాధరావు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సింగం రాధ స్వాగతం పలికారు. ఆలయ సంప్రదాయాల ప్రకారం, వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. న్యాయమూర్తి ముందుగా కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అనంతరం బేడ మండప ప్రదక్షిణ చేశారు. తదుపరి స్వామివారి మూలవిరాట్టును దర్శించారు. ఆలయ అధికారులు స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి, ప్రసాదాలను అందజేశారు. సిబిఐ కోర్టు ప్రిన్సిపల్ స్పెషల్ జడ్జి సిఎన్.మూర్తి కూడా స్వామిని దర్శించుకున్నారు. ఆలయ పర్యవేక్షణాధికారి కె.వెంకటేశ్వరావు, పిఆర్ఓ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ దీపాలు ఏర్పాటు

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 13వ వార్డు పరిధిలోని వాకర్స్ అసోసియేషన్ ఓపెన్ జిమ్ వద్ద కొత్తగా విద్యుత్ దీపాలను అమర్చారు. బిఆర్‌టిఎస్ రోడ్డు నుంచి ఆరిలోవ కాలనీకి వచ్చే రహదారిలో ఓపెన్ జిమ్ వద్ద విద్యుత్ దీపాలు కావాలని స్థానికుల వినతి మేరకు వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత సత్యనారాయణ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన ఆ శాఖ అధికారులను ఆదేశించి ఆ ప్రాంతంలో రూ.1.20 లక్షలతో నూతన విద్యుత్ స్తంబాలను, దీపాలను ఏర్పాటుచేశారు.స్థానికులు, వాకర్స్, వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు.

గద్దలతో పర్యావరణ సమతుల్యత

ప్రజాశక్తి - ఆరిలోవ : గద్దలు పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయని, వాటి సంరక్షణ జీవ వైవిధ్యానికి అత్యంత అవసరం అని జూ క్యూరేటర్ జి.మంగమ్మ తెలిపారు. ఇందిరాగాంధీ జంతు ప్రదర్శన శాలలో గద్దల అవగాహన దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాల, డబ్ల్యు డబ్ల్యుఎఫ్ ఇండియా సహకారంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో గద్దల చరిత్ర, వర్తమానం, భవిష్యత్, సంరక్షణ చర్యలు అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. దీనిలో భాగంగా విద్యార్థులకు ఎలక్యూషన్, గద్దల మట్టి బొమ్మల తయారీ పోటీలను నిర్వహించారు. వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. హెరిటేజ్ నెరేటర్, గిరిజన సమాజ సమన్వయకర్త జయశ్రీ హటంగి, పర్యావరణ కార్యకర్త సోహన్ హటంగిలు పోటీలకు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ పి.భాను, అసిస్టెంట్ క్యూరేటర్స్ బి.గోపి, పివి.చౌదరి తదితరులు పాల్గొన్నారు.

8న మండల సమావేశం

ప్రజాశక్తి -భీమునిపట్నం : భీమిలి మండల పరిషత్ సభ్యుల సాధారణ సమావేశం ఈ నెల 8వ తేదీ మధ్యాహ్నం 2.30 గంటలకు స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ కెవి.నరసింహారావు తెలిపారు.

అక్రమ లేఅవుట్‌తో నీట మునిగిన వరి పంట

ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

సమస్యను పరిష్కరించాలని రైతుల గగ్గోలు



ముదుకు లోతు నీటి ముంపులో ఉన్న వరి పైరు

ప్రజాశక్తి-అనకాపల్లి

అక్రమ లేఅవుట్ పుణ్యమా అని పొలాల్లో వర్షపు నీరు నిల్చిపోయి బయటకు పోయే దారి లేక వందలాది ఎకరాల్లో వరి పంట దెబ్బతింటుంది. తమ సమస్యను పరిష్కరించండి మహాప్రభో అంటూ రైతులు అధికారుల కాళ్లా వేళ్లా పడినా సమస్య పరిష్కారం కాకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మండలంలోని తుమ్మపాల గ్రామంలో సర్వే నెంబర్ 39, 316, 317లో సుమారు 350 మంది రైతులు తాత తండ్రుల నుంచి వ్యవసాయం చేసుకుని జీవిస్తున్నారు. వర్షాధారంతో వరి, చెరకు వంటి పంటలు పండిస్తున్నారు. అయితే వర్షాకాలంలో అధికంగా నిల్చిపోయే నీరు తుమ్మపాల శ్మశాన వాటికను ఆనుకొని ఉన్న కాలువ ద్వారా శారదా నదిలో కలిసేది. ప్రస్తుతం నీటి ప్రవాహానికి అడ్డంగా కొంతమంది అక్రమ లేఅవుట్ వేయడంతో నీరు పారే దారి లేక వర్షపు నీరు పంట పొలాల్లోనే నిలిచిపోయింది. దీంతో రైతులు పలుమార్లు గ్రామ నాయకులు, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. సమస్య నెలల తరబడి పరిష్కారం కాకపోవడంతో కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో



పంట పొలాలకు అడ్డంగా వేసిన అక్రమ లేఅవుట్

ఫిర్యాదు చేశారు. ఇప్పటికే రైతులు అప్పులు తీసుకువచ్చి పెట్టుబడులు పెట్టామని, సమస్య పరిష్కారం కాకుంటే తీవ్రంగా నష్టపోతామని గగ్గోలు పెడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, స్థానిక నేతలు కలగజేసుకొని సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

తీవ్రంగా నష్టపోతున్నాం



మా తాత తండ్రుల నుంచి వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నాం. వర్షాధారంగా వేసిన పంటలు అధికంగా వర్షం వస్తే శ్మశాన వాటిక వద్ద ఉన్న కాలువ ద్వారా శారదా నదిలో కలిసేది. ప్రస్తుతం నీటి ప్రవాహానికి అడ్డంగా లేఅవుట్ వేయడంతో వర్షపు నీరు తమ పొలాల్లో నిలిచి తీవ్రంగా నష్టపోతున్నాం.

- గూటాల వెంకటరమణ, రైతు

సమస్యను పరిష్కరించాలి



తుమ్మపాల నుంచి వెంకుపాలెం బవులవాడ సరిహద్దుల్లో సుమారు 350 రైతు కుటుంబాలు ఈ ప్రాంతంలో వ్యవసాయం చేస్తున్నాం. లేఅవుట్ వేయడం ద్వారా నీరు పోయే దారి లేక నష్టపోతున్నాం. తక్షణమే అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

- గుడ్డేటి నాయుడు, రైతు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

మెగా ఉద్యోగ మేళా పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-అనకాపల్లి : ఈనెల 13న అనకాపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించు మెగా ఉద్యోగ మేళాకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను స్థానిక గుండాల జంక్షన్ శంకరన్ సమావేశ మందిరంలో శనివారం ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ జాబ్ మేళాకు సుమారు 25 బహుళ జాతి కంపెనీలు హాజరవుతున్నాయని తెలిపారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి డాక్టర్ ఎన్.గోవిందరావు మాట్లాడుతూ పదవ తరగతి, ఐటిఐ, డిప్లొమా, డిగ్రీ, పిజి వరకు చదువుకొని 18 నుండి 35 సంవత్సరాల వయస్సు గల యువతీ, యువకులు ఈ జాబ్ మేళాలో పాల్గొనవచ్చని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు తమ వివరములను naipunyam.ap.gov.in వెబ్ సైట్‌లో నమోదు చేసుకొని, రిఫరెన్స్ నెంబర్‌తో పాటుగా రెస్యూమేలు, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికేట్లు జెరాక్స్ కాపీలతో ఆ రోజు ఉదయం 9 గంటలకు జాబ్ మేళా జరుగు ప్రదేశానికి హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు 7013342667 నెంబర్లను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో జివిఎంసి జోనల్ కమిషనర్ చక్రవర్తి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



పాయకరావుపేట మెయిన్‌పై నిలిచిపోయిన నీరు

చెరువును తలపిస్తున్న మెయిన్ రోడ్డు

ప్రజాశక్తి-పాయకరావుపేట : పాయకరావుపేట పట్టణంలోని మెయిన్ రోడ్డు కొద్దిపాటి వర్షపు నీటికే చెరువును తలపిస్తోంది. దీంతో వాహనచోదకులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లక్ష్మీ థియేటర్ నుంచి మండి రెస్టారెంట్ వరకూ ఉన్న రోడ్డుపై వర్షం నీరు నిలిచిపోతుండటంతో ప్రయాణికులు అవస్థలకు గురవుతున్నారు. ముఖ్యంగా పాఠశాల విద్యార్థులు ఈ వర్షపు నీటిలో ప్రయాణించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు నిర్మాణం చేపట్టిన అధికారులు రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ నిర్మించకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. అధికారులు ఇప్పటికైనా స్పందించి రోడ్డుకు ఇరువైపులా డ్రెయిన్ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

పంచాయతీ స్థలాలను ఆక్రమిస్తే చర్యలు



అక్రమ లేఅవుట్‌లో హెచ్చరిక బోర్డు వేస్తున్న డిపిఒ తదితరులు

ప్రజాశక్తి-పాయకరావుపేట : పంచాయతీ స్థలాలను ఆక్రమిస్తే సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా పంచాయతీ అధికారి సందీప్ హెచ్చరించారు. ఈ మేరకు పాయకరావుపేట పట్టణంలోని అక్రమ లే అవుట్లను శనివారం సాయంత్రం ఆయన పరిశీలించారు. నర్సీపట్నం డిఎల్‌పిఒ ఎస్ఎస్ఎస్ఎన్.మూర్తి, ఇఒపిఆర్డీ డేవిడ్, పంచాయతీ సిబ్బందితో కలసి పట్టణంలో పంచాయతీకి కేటాయించి, కబ్జాలకు గురైన ప్రభుత్వ స్థలాలను గుర్తించి బోర్డులు పాతించారు. దేవీనగర్, జగతా శ్రీను లే అవుట్లలో బోర్డులు వేశారు. అనంతరం మంగవరం రోడ్డులో వేసిన లేఅవుట్లను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. పట్టణంలో ఆక్రమణలకు గురైన పంచాయతీ స్థలాలను గుర్తించి స్వాధీనం చేసుకుంటున్నామని ఆయన చెప్పారు.

ఎస్.రాయవరం : మండలంలోని తిమ్మాపురం, గుమ్ములూరు పంచాయతీలలో అక్రమ లేఅవుట్లను జిల్లా పంచాయతీ అధికారి సందీప్ శనివారం తనిఖీ చేశారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి వేసిన అక్రమ లేఅవుట్లలో క్రయ విక్రయాలు చెల్లుబాటు కావని, వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని డిపిఒ హెచ్చరించారు. అనంతరం చెత్తనుండి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ బంగారు సత్యనారాయణ, పలువురు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



పారిశుధ్య పనులు చేస్తున్న పంచాయతీ సిబ్బంది

సర్పంచ్ ఆధ్వర్యాన పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండల కేంద్రం బుచ్చయ్యపేటలోని పలు వీధుల్లో స్థానిక సర్పంచ్ సుంకర లక్ష్మి ఆధ్వర్యంలో శనివారం పారిశుధ్య పనులు నిర్వహించారు. వీధుల్లోని చెత్తను తొలగించి బ్లీచింగ్ చల్లించారు. క్లోరినేషన్ చేయించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సీరా లవరాజు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ పాదయాత్రకు మద్దతు

ప్రజాశక్తి-ఎస్.రాయవరం : స్త్రీ శక్తి పథకం ద్వారా నష్టపోతున్న ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని కోరుతూ విశాఖ నుండి అమరావతికి ఒక ఆటో డ్రైవర్ చేపట్టిన పాదయాత్రకు స్థానిక ఆటో డ్రైవర్లు మద్దతు తెలియజేశారు. విశాఖకు చెందిన చింతకాయల శ్రీను ఈ నెల 2న విశాఖ నుండి పాదయాత్ర ప్రారంభించారు. శనివారం నాటికి వంద కిలోమీటర్లు నడచి అడ్డురోడ్డుకు చేరుకున్నారు. అడ్డురోడ్డులో ఎనిమిది ఆటోస్టాండ్లకు చెందిన ఆటో డ్రైవర్లు ఆయనకు పూలమాల వేసి సత్కరించారు. అమరావతిలో సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్‌లను కలిసి తమ సమస్యను విన్నవిస్తానని శ్రీను చెప్పారు.

పాము కాటుతో యువకుడు మృతి



బుద్ధ శ్రీను (ఫైల్‌ఫోటో)

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని ఎం.అలమండ గ్రామానికి చెందిన బుద్ధ శ్రీను (28) పాము కాటుకు గురై మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. ప్రైవేట్ ఉద్యోగిగా పనిచేస్తున్న శ్రీను శుక్రవారం రాత్రి తన స్నేహితులతో కలిసి గ్రామ శివారులోని కళ్లానికి వెళ్లాడు. అక్కడ కాలకృత్యాలు తీర్చుకునే సమయంలో విషసర్పం అతని ఎడమ కాలుపై కాటు వేసింది. కేకలు వేసిన శ్రీనును స్నేహితులు తక్షణమే కె.కోటపాడు సీహెచ్‌సీ తరలించారు. అయితే అప్పటికే విషం ప్రభావం ఎక్కువ కావడంతో మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి తండ్రి గోవింద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించామని ఎస్ఐ పి.సత్యనారాయణ తెలిపారు. శ్రీనుకు తల్లిదండ్రులతో పాటు చెల్లెలు రమ్య ఉన్నారు. ఒక్కగానొక్క కుమారుడిని కోల్పోవడంతో కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. విషయం తెలుసుకున్న రైవాడ జలాశయ ఛైర్మన్ పోతల పాత్రునాయుడు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి సహకారంతో ప్రభుత్వ పరంగా కుటుంబానికి ఆర్థిక సాయం అందేలా కృషి చేస్తానని భరోసా ఇచ్చారు.

త్వరలో ఉపకరణాల పంపిణీ

ప్రజాశక్తి-అనకాపల్లి : వికలాంగులకు త్వరలో ఉచితంగా ఉపకరణాలు పంపిణీ చేయనున్నట్లు అనకాపల్లి జిల్లా సమగ్ర శిక్ష సహిత విద్య సమన్వయకర్త బి.రామకృష్ణ నాయుడు అన్నారు. ఏపి సమగ్ర శిక్ష, ఆలీంకో సంస్థ ఆధ్వర్యంలో శనివారం అనకాపల్లి, పరవాడ, సబ్బవరం, కశింకోట మండలాలకు చెందిన వికలాంగ విద్యార్థులకు ఉచిత ఉపకరణాలు అందించేందుకు గుర్తింపు నిర్ధారణ శిబిరం అనకాపల్లి మున్సిపల్ టౌన్ గర్ల్స్ హైస్కూల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణనాయుడు మాట్లాడుతూ నాలుగు మండలాల నుండి 350 మంది వికలాంగ విద్యార్థులు హాజరైనట్లు చెప్పారు. మేధోవైకల్యం గల విద్యార్థులకు మేధో వైకల్య బోధనోపకరణ సామాగ్రి కిట్లు, శారీరక వికలాంగులకు మోటార్రైజ్డ్ బ్యాటరీ ట్రై సైకిల్స్, ట్రై సైకిల్స్, వీల్ ఛైర్స్, సిపి ఛైర్స్, వినికిడి లోపం గల వారికి వినికిడి యంత్రాలు, దృష్టిలోపం ఉన్న వారికి బ్రెయిలీ కిట్లను ఉచితంగా అందించడానికి ఈ శిబిరం నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమానికి ఎంఇఒ శ్రీదేవి, మున్సిపల్ గర్ల్స్ హైస్కూల్ హెచ్ఎం రుదిర రాణి, ఉపాధ్యాయులు అర్జున్, భవిత కేంద్రాల ప్రత్యేక ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిషేధిత చేపలు పెంచితే చర్యలు

ప్రజాశక్తి-కె.కోటపాడు : గ్రామీణ ప్రాంతాల్లోని ప్రైవేట్, ఇరిగేషన్ చెరువుల్లో నిషేధిత క్యాట్ ఫిష్, జెల్ల రకాల చేపలు పెంచడానికి వీల్లేదని, ఎక్కడైనా అటువంటి చేపలు పెంచితే భారీగా జరిమాన విధించడం జరుగుతుందని మత్స్యశాఖ అభివృద్ధి అధికారి టి.నాగమణి చేపల పెంపకం దారులను హెచ్చరించారు. కె.కోటపాడు, దేవరాపల్లి మండలాల్లో ప్రైవేటు వర్గకులు నిర్వహిస్తున్న చేపల చెరువులను శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ పరిధిలో ఉన్న మత్స్యకార సొసైటీలు సమర్థవంతంగా పనిచేస్తున్నాయని, ప్రతి సొసైటీకి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తుందని చెప్పారు. 100 మంది సభ్యులు ఉన్నవారికి రూ.7 లక్షలు, 35 మంది సభ్యులు ఉన్నవారికి లక్ష రూపాయలు ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ నిధులతో చెరువులు అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. మత్స్యకార సొసైటీల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చెరువుల్లో కోడి వ్యర్థాలు వినియోగించడం లేదని స్పష్టం చేశారు. అక్కడక్కడ ప్రైవేట్ యాజమాన్యాలు చేపలు పెంపకానికి కోడి వ్యర్థాలు వినియోగిస్తున్నట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు 76 చెరువుల యజమానులకు జరిమానా విధించామని తెలిపారు.

పాత్రికేయులకు సన్మానం

ప్రజాశక్తి-చోడవరం : స్థానిక వాసవి క్లబ్ ప్రతి సంవత్సరం జరిగే వాసవి వారోత్సవాల్లో భాగంగా శనివారం పాత్రికేయులను ఘనంగా సన్మానించారు. ప్రజలకు ప్రభుత్వాలకు వారధిగా పాత్రికేయులు ఉంటారని పలువురు కొనియాడారు. సీనియర్ వాసవి క్లబ్ కార్యవర్గ సభ్యులు కే శేషగిరిరావు పి.హరిబాబు, ఎస్.శ్రీనివాసరావు, పి.శాంత తదితరులను సన్మానం చేశారు. కార్యక్రమం వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ ఉత్సవ అధ్యక్షులు కలగర్ల శేషగిరిరావు, వాసవి క్లబ్ అధ్యక్షులు ఈ.లక్ష్మణ్ కార్యదర్శి వి.కామరాజు, ట్రెజరర్ కే శ్రీనివాసరావు, వనిత క్లబ్ అధ్యక్షురాలు పి తులసి, సెక్రెటరీ పి జానకి, కోశాధికారి కే కనక లక్ష్మి, యూత్ క్లబ్ ప్రతినిధులు బి రాజు, వీ రాజేష్, ఎ శ్రీనివాస్ పాల్గొన్నారు.



పాత్రికేయులను సత్కరిస్తున్న వాసవి క్లబ్ ప్రతినిధులు

రైతులకు అందుబాటులో యూరియా



మాట్లాడుతున్న సత్యనారాయణ

ప్రజాశక్తి-సబ్బవరం : ఖరీఫ్ సీజన్‌లో వరి పంటకు కావలసిన యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని, మండలంలోని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మండల వ్యవసాయ అధికారి పోతల సత్యనారాయణ అన్నారు. శనివారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ మండలంలోని ఖరీఫ్ సీజన్‌కు 1358 హెక్టార్లలో వరి పంట వేయాల్సి ఉండగా, 1212 హెక్టార్లలో వరి నాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. రైతు సేవా కేంద్రాలు, మన గ్రోమోర్, ప్రైవేట్ డీలర్ల దగ్గర యూరియా స్టాక్ ఉన్నట్లు చెప్పారు. యూరియా నిల్వలపై మండల మోనిటరింగ్ కమిటీ తహశీల్దారు, ఎంపిడిఓ, వ్యవసాయ అధికారి ప్రతిరోజూ తనిఖీలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. వరి పంట పిలకల దశలో ఉన్నప్పుడు 72 మెట్రిక్ టన్నులు, వరినాట్లు వేసి 55-60 రోజుల్లో వరి పంట చిరు పొట్ట దశలో ఉన్నప్పుడు మరో 80 మెట్రిక్ టన్నులు మండలంలో రైతులకు యూరియా అవసరమవుతుందని, దానికి తగినట్లుగా ఏర్పాట్లు చేస్తామని చెప్పారు.

బుచ్చెయ్యపేట : మండలంలో రైతులకు అవసరమైన యూరియాను సరఫరా చేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి బి.భాస్కరరావు తెలిపారు. శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గంటి కొర్లాం, రాజాం రైతు సేవా కేంద్రాలకు 12.15 టన్నుల చొప్పున యూరియా రాగా రైతులకు పంపిణీ చేశామన్నారు. శనివారం గున్నెంపూడి ఆర్ఎస్‌కెకు 12.015 మెట్రిక్ టన్నులు యూరియా వచ్చిందన్నారు. మండలంలోని రైతులకు అవసరమైన యూరియాను సరఫరా చేస్తున్నట్లు చెప్పారు.

చీడికాడ : మండలంలో రైతు సేవ కేంద్రాల్లో రైతులకు యూరియా అందుబాటులో ఉందని వాటిని రైతులు దశలవారీగా పైరుకు వేయాలని మండల వ్యవసాయ అధికారిని ఏ కృష్ణవేణి అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చీడికాడ మండలంలో జి కొత్తపల్లి, అర్జునగిరి, బయలుపూడి, తురువోలు, కం డి వరం, అప్పలరాజు పురం గ్రామాలలో రైతు సేవా కేంద్రాల్లో యూరియా అందుబాటులో ఉందని అవసరమైన రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె అన్నారు. మిగిలిన రైతు సేవ కేంద్రంలో కూడా యూరియా సరఫరా చేయడం జరుగుతుందన్నారు.



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డిఎంహెచ్‌ఓ హైమావతి

ప్రైవేటు క్లినిక్‌లకు రిజిస్ట్రేషన్ లేకుంటే చర్యలు

ప్రజాశక్తి-వడ్డాది : ప్రైవేట్ క్లినిక్‌లు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, లేకుంటే శాఖపరమైన చర్యలు తప్పవని డిఎంహెచ్‌ఓ డాక్టర్ హైమావతి హెచ్చరించారు. బుచ్చియ్యపేట మండలం వడ్డాదిలోని ప్రైవేట్ క్లినిక్‌ను శనివారం ఆమె పరిశీలించారు. అనంతరం వడ్డాది పిహెచ్‌సిని సందర్శించారు. ఆసుపత్రి ఓపీ, ఇమ్యునైజేషన్, ఫార్మసీ రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వ వైద్య, ఆరోగ్య కార్యక్రమాల అమలుపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ప్రైవేటు ల్యాబ్‌లు, ఆర్ఎంపి ఆసుపత్రుల సిబ్బందితో సమావేశమయ్యారు. అనధికారికంగా నిర్వహిస్తున్న ప్రైవేట్ ల్యాబ్‌ను వెంటనే మూసివేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైద్యాధికారి రమ్య, దుర్గ పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి అధికారులు సహకరించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి పట్టణ అభివృద్ధికి అధికారులు సహకరించాలని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. ఎమ్మెల్యే ఆధ్వర్యంలో స్థానిక ఆర్వో ఆఫీసులో జీవీఎంసీ అధికారులతో శనివారం సమీక్ష సమావేశం జరిగింది. పట్టణ పరిధిలోని రెవెన్యూ, పబ్లిక్ హెల్త్, ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, హార్టికల్చర్ అధికారులు ఇందులో పాల్గొన్నారు. పట్టణ అభివృద్ధికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని ఆదేశించారు. పట్టణంలో కుక్కల బెడద ఎక్కువగా ఉందని, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్, ఏసిపి టిపిఓ సర్వేయార్, అన్ని డిపార్ట్‌మెంట్ల ఈఈ, డిఈ, ఏఈలు, ఏడీవో, ఆర్వోలు, ఆర్‌ఐలు పాల్గొన్నారు.

బార్ తొలగింపుపై హర్షం

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి వేల్పుల వీధి జీవీఎంసీ బాలికల ఉన్నత పాఠశాలకు కూతవేటు దూరంలో ఏర్పాటు చేసిన బారును ఎమ్మెల్యే చొరవతో తొలగించడంపై స్థానిక మహిళలు, యువకులు హర్షం వ్యక్తం చేశారు. శ్రీగౌరీ పరమేశ్వరుల ఆలయం, బాలికల ఉన్నత పాఠశాల, మహిళా పోలీస్ స్టేషన్‌కు అత్యంత చేరువలో ఏర్పాటు చేసిన ఈ బారును తక్షణమే తొలగించాలని స్థానికులు నిరసనలు తెలియజేసి, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఆయన అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసి తక్షణమే అక్కడ నుంచి బారును తొలగించాలని ఆదేశించడంతో అక్కడున్న రాయల్ బార్ అండ్ రెస్టారెంట్‌ను తొలగించారు. ఈ మేరకు శనివారం వేల్పులవీధి మహిళలు యువకులు గౌరీ పరమేశ్వరుల ఆలయం వద్ద మీడియా సమావేశం ఏర్పాటు చేసి ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో జనసేన, టిడిపి నాయకులు మంగా ఈశ్వర్, బొద్దపు ప్రసాద్, గరికి వెంకట్రావు, గొర్లి శేఖర్, ఆళ్ల రామచంద్రరావు పాల్గొన్నారు.

పవర్ యూత్ ఆధ్వర్యాన అన్న సమారాధన

ప్రజాశక్తి-కశింకోట : కసింకోట పాల కేంద్రం వద్ద పవర్ యూత్ సంఘం ఆధ్వర్యంలో వినాయక నవ రాత్రుల్లో భాగంగా శనివారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి పెంటకోట జ్యోతి శ్రీను, యూత్ ప్రతినిధులు పెంటకోట సైదునాయుడు, పెంటకోట సత్యారావు, భీమరశెట్టి మునిలి నాయుడు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

అనకాపల్లి : స్థానిక నరసింగరావుపేటలోని వినాయక నవరాత్రుల ఉత్సవంలో భాగంగా శనివారం ఏర్పాటు చేసిన అన్న సమారాధన కార్యక్రమాన్ని ప్రముఖ వ్యాపారవేత్త ముత్యాల వెంకటేశ్వరరావు తనయుడు ముత్యాల రాజేష్ ప్రారంభించారు. రాజేష్‌ను ఉత్సవ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, పాల్గొన్నారు.



అన్న సమారాధనను ప్రారంభిస్తున్న పెంటకోట జ్యోతి, శ్రీను

రైతులకు యూరియా పంపిణీ



తిమ్మరాజుపేటలో యూరియా పంపిణీ చేస్తున్న జగ్గాప్పారావు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని తిమ్మరాజుపేట పిఎసిఎస్ వద్ద పర్సన్ ఇన్‌చార్జ్ ఎస్.జగ్గఅప్పారావు శనివారం రైతులకు ఎరువులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పిఎసిఎస్ సీఈవో ఐఎస్.మహేశ్వరరావు, ఆర్.విశ్వేశ్వరరావు, వై.మహేంద్ర, ఎం శ్యామల, ఈ మురళి, ఏ పార్వతి, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం : మండలంలో పెద్ద గుమ్ములూరు, సర్వసిద్ధి రైతు సేవా కేంద్రాలలో రైతులకు శనివారం యూరియా పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్పెషలాఫీసర్ మనోరమ, తహశీల్దారు జె.రమేష్‌బాబు, ఎంపిడిఓ జి.సత్యనారాయణ, ఏఎస్ఐ వెంకటేశ్వర్లు , మండల వ్యవసాయ అధికారి డి సౌజన్య, సిబ్బంది పాల్గొన్నారు.

నక్కపల్లి : రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా యూరియా పంపిణీ చేపట్టాలని తహసిల్దార్ నరసింహమూర్తి, ఎంపిడిఓ డి సీతారామరాజు వ్యవసాయ అధికారులకు సూచించారు. మండలంలో గుల్లిపాడు, గొడిచెర్ల గ్రామాల్లో శనివారం రైతు సేవా కేంద్రాలను సందర్శించి, రైతులకు యూరియా పంపిణీ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. యూరియా పంపిణీ పై వ్యవసాయ అధికారులు, సిబ్బందితో సమీక్షించారు. రైతులకు యూరియా వాడకం పై అవగాహన కల్పించారు. అధికారులు పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్ మాటల్లో నిజాయితీ లేదు

ప్రజాశక్తి-దేవరాపల్లి : గిరిజనులు, గిరిజన ప్రాంత అభివృద్ధి విషయంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మాటల్లో నిజాయితీ లేదని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన తరువాత పవన్ కల్యాణ్ గిరిజన ప్రాంతంలో తిరిగి ప్రతి గిరిజన గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పిస్తామని, గిరిజనుల బతుకుల్లో వెలుగులు నింపు తామని ప్రతిజ్ఞ చేశారని గుర్తు చేశారు. కాని కూటమి ప్రభుత్వంలో చేసిన పనులకు బిల్లులు ఇవ్వలేదని, కొత్తగా ఒక్క రోడ్డు కూడా వేయలేదని తెలిపారు. దేవరాపల్లి మండలం బోడిగరువు నెరెళ్ళపూడి రోడ్డు పూర్తిగా కొట్టుకుపోయిందని తెలిపారు. వి.మాడుగుల మండలం అజయపురం గ్రామానికి చెందిన పివిటిజి ఆదివాసీ మహిళ కూలి పనికి వెళ్లి రోడ్డు సౌకర్యం లేక కర్రలతో నిర్మించిన వంతెన దాటబోయి కాలు జారి గెడ్డలో పడి చనిపోయిందని పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యానికి గిరిజనులు ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శంకరం పంచాయతీలోనూ ఇదే పరిస్థితి ఉందన్నారు. కొత్తవలస, వెలగలపాడు, గొప్పూరు, తాడివలస, రాయిపాలెం, రాజంపేట, మామిడిపాలెం గ్రామాలకు రోడ్లను అసంపూర్తిగా వదిలేశారని పేర్కొన్నారు. ఇప్పటికైనా పవన్ కల్యాణ్ నిజాయితీగా వ్యవహరించి ఆయా గిరిజన గ్రామాలకు రోడ్డు, బ్రిడ్జిలు నిర్మించి గిరిజనుల ప్రాణాలు కాపాలని డిమాండ్ చేశారు. అజయపురం గ్రామంలో చనిపోయిన మచ్చమ్మ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

జనసేన నాయకుడు రాంబాబు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-ఎస్.రాయవరం : ఎస్‌కెఎంఎల్ డాబా అధినేత, జనసేన సీనియర్ నాయకులు తుంపాల రాంబాబు జన్మదిన వేడుక కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి అనాధశరణాలయంలో శనివారం నిర్వహించారు. కొక్కిరాపల్లి గ్రామంలోని ప్రేమసమాజం అనాథ శరణాలయంలో పిల్లలు, వృద్ధులకు కావలిసిన నిత్యావసర వస్తువులు అందించారు. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేశారు. రాంబాబుకు అక్కడి పిల్లలు, పెద్దలు శుభాకాంక్షలు తెలియజేశారు.



కేక్ కట్ చేస్తున్న తుంపాల రాంబాబు



తహశీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సాగు రైతులు

రైత్వారీ పట్టాలివ్వాలని ధర్నా

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలంలోని చౌడువాడ, పాచిలవాని పాలెం గ్రామాల్లో భూములు సాగు చేస్తున్న వారికి రైత్వారీ పట్టాలు ఇవ్వాలని కోరుతూ రైతు కూలీ సంఘం ఆధ్వర్యాన రైతులు శనివారం తహశీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. దీనికి ముందు కె.కోటపాడు పురవీధుల్లో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కార్యదర్శి దంతులూరి వర్మ మాట్లాడుతూ మూడు తరాలుగా సాగులో ఉంటూ 1959 నుండి గెజిట్ పబ్లికేషన్స్ ఆర్డిఓ ప్రొసీడింగ్స్ హైకోర్టు ఆర్డర్స్ ఉన్నప్పటికీ పట్టాలు మంజూరు చేయకుండా రెవిన్యూ ఎండోమెంట్ ఇనాందారులు కుమ్మక్కై అడ్డుకుంటున్నారని ఆరోపించారు. రైతులకు దక్కాల్సిన భూములు కార్పొరేట్లకు అప్పగించడం కోసం కుట్రలు జరుగుతున్నాయని తెలిపారు. అనంతరం తహశీల్దార్ భుజంగరావుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి కోన మోహన్‌రావు, రైతు కూలీ సంఘం నాయకులు రొంగలి సూర్యనారాయణ, ఏటుకూరు రాజేష్, కుమార వెంకటరమణ, నందారపు భాస్కరరావు, చౌడువాడ సర్పంచ్ దాడి ఎరుకనాయుడు పాల్గొన్నారు.

నిర్వహణకు మాత్రమే వసూలు

ప్రజాశక్తి-అనకాపల్లి : ఖైరతాబాద్ మాదిరిగా అనకాపల్లి 126 అడుగుల భారీ మట్టి వినాయక విగ్రహం ఏర్పాటులో తమ స్వార్థం ఏమీ లేదని, అనకాపల్లి పేరును దేశవ్యాప్తం చేసేందుకే ఏర్పాటు చేశామని సంపత్ వినాయక ఉత్సవ కమిటీ అధ్యక్షుడు బుద్ధా భూలోకనాయుడు తెలిపారు. స్థానిక విలేకరులతో శనివారం ఆయన మాట్లాడుతూ నిర్వహణకు అవసరమైన మేరకు భక్తుల నుంచి నామ మాత్రపు రుసుము మాత్రమే వసూలు చేసినట్లు చెప్పారు. వాహనాలకు ఎటువంటి పార్కింగ్ ఫీజు లేదన్నారు. దీని నిర్వహణకు సొంత నిధులు ఖర్చు చేయవలసిన పరిస్థితి ఏర్పడిందన్నారు. తమపై కొంతమంది తప్పుగా విమర్శలు చేయడం సరికాదన్నారు.

పోగొట్టుకున్న వెండి పట్టీలు సీసీ కెమెరాలతో గుర్తింపు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : సీసీ కెమెరాలు సహాయంతో పోగొట్టుకున్న వెండిగ పట్టీలను పోలీసులు గుర్తించారు. స్థానిక సిఐ నమ్మి గణేష్ తెలిపిన వివరాలు ప్రకారం.. రాంబిల్లి మండలం కొండల దేవుడుపాలెం గ్రామానికి చెందిన కందారు సత్యవతి శనివారం అచ్యుతాపురం వచ్చి ఒక జ్యూస్ షాపు వద్ద జ్యూస్ తాగింది. ఆ సమయంలో 20 తులాలు వెండి పట్టీలు గల సంచిని అక్కడ పెట్టింది. జ్యూస్ తాగిన అనంతరం వెండి పట్టీల సంచిని మర్చిపోయి తిరిగి తన గ్రామానికి వెళ్ళిపోయింది. ఇంటికి వెళ్లి చూడగా వెండి పట్టీలు పర్సు కనిపించలేదు. వెంటనే ఆమె అచ్యుతాపురం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు జ్యూస్ పాయింట్ వద్ద, సమీపంలో ఉన్న సీసీ కెమెరాలు పరిశీలించి ఆమె మరిచిపోయిన వెండి పట్టీలు గల పర్సుతో కూడిన సంచిని గుర్తించారు. ఆమెను పిలిచి వెండి పట్టీల పర్సును అప్పగించారు.

నానో ఎరువులపై అవగాహన

ప్రజాశక్తి-కోటవురట్ల : నానో ఎరువులతో అధిక దిగుబడులు సాధించడంతో పాటు పెట్టుబడి తగ్గుతుందని మండల వ్యవసాయ శాఖ అధికారి సరోజినీ తెలిపారు. మండలంలోని ఎండపల్లి గ్రామంలో నానో ఎరువుల వాడకంపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ నానో ఎరువును ఎకరాకు 500 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. పొటాషియం ఎరువులు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



నానో ఎరువులు చూపుతున్న రైతులు

యూరియా కోసం అన్నదాతల అగచాట్లు

- మండుటెండలో గంటల తరబడి నిరీక్షణ


యూరియా కోసం గుమిగూడి ఉన్న రైతులు

ప్రజాశక్తి- మాడుగుల: రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న యూరియా కోసం పడరాని పాట్లు పడాల్సి వస్తుందని ప్రభుత్వాధికారుల తీరుపై అన్నదాతలు మండిపడుతున్నారు. మాడుగుల మండలంలోని కె జె పురం గ్రామంలో శనివారం పిఎసిఎస్ కేంద్రానికి 22 టన్నులు యూరియా వచ్చింది. ఈ విషయాన్ని తెలుసుకున్న అన్నదాతలు తెల్లవారి నాలుగు గంటల నుండి పిఎసిఎస్ వద్ద బారులు తీరారు.గంటల తరబడి క్యూలైన్లో వేచి ఉన్నప్పటికీ పిఎసిఎస్ సిబ్బంది ఒక్కొక్క రైతుకు ఒక్క యూరియా కట్ట మాత్రమే ఇవ్వడం జరుగుతుందని, ఆధార్, 1బి తప్పనిసరిగా తీసుకురావాలని చెప్పడంతో క్యూ లైన్ లో ఉన్న రైతన్నలు ఒక్కసారిగా ఆధార్ వన్ బీ లు కోసం పరుగులు తీశారు. కెజె పురం గ్రామంలో 2 వేలు ఎకరాలల్లో వరునారులు వేస్తే ఈ యూరియా ఎక్కడ సరిపోతుందని చాలీచాలని ఎరువులను పంపించి రైతన్నలతో ప్రభుత్వం ఆటలాడుతుందని అధికారులపై మండిపడ్డారు. దీంతో క్యూ లైన్ లో కాసేపు గందరగోళ పరిస్థితి నెలకొంది. విషయం తెలుసుకున్న ఎన్ఫోర్స్మెంట్ అధికారులు ,వ్యవసాయ అధికారి అనసూయ, తహసిల్దార్ రమాదేవి, ఎంపీడీవో కొంకి అప్పారావు, పోలీస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి పి ఎ సి ఎస్ వద్దకు చేరుకొని రైతులకు నచ్చజెప్పి ప్రతి ఒక్కరికి యూరియా అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మునిపెన్నడు యూరియా కోసం ఇంత అవస్థపడిన దాఖలాలు లేవని ప్రభుత్వం అధికారులు నిర్లక్ష్యంతోనే యూరియా కోసం రైతులు ఇన్ని పాట్లు పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కొంతమంది రైతులు యూరియా కోసం జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఈ విషయంపై వ్యవసాయ శాఖ అధికారులు మాట్లాడుతూ.. మరింత యూరియా రానున్న రోజుల్లో పిఎసిఎస్లు, ఆర్ బికె,ప్రైవేట్ డీలర్ల వద్దకు వచ్చే అవకాశం ఉందని, యూరియా కోసం రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదని రైతులకు నచ్చ చెబుతున్నారు.


వేచివున్న రైతులు


స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

వాలీబాల్ కోర్టుకు స్థల పరిశీలన

ప్రజాశక్తి -నక్కపల్లి:నక్కపల్లి కొత్తపేటలో ఉన్న వాలీబాల్ కోర్టు స్థలాన్ని శనివారం తహసిల్దారు నరసింహమూర్తి, ఎంపీడీవో డి సీతారామరాజు, డిప్యూటీ ఎంపీడీవో చలపతిరావు పరిశీలించారు. వాలీబాల్ కోర్టు స్థలానికి సంబంధించి సరిహద్దుల వివరాలను సర్వేయర్ సత్తిబాబు వివరించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, నక్కపల్లి లో ఉన్న వాలీబాల్ కోర్టుకు సంబంధించిన స్థలాన్ని పరిశీలించామని, నివేదికను జిల్లా కలెక్టర్కు పంపిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నక్కపల్లి పి ఎస్ సి ఎస్ డైరెక్టర్ కోసూరి శ్రీనివాసరావు, వీఆర్వో కామరాజు, హైస్కూల్ పిడి, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.


ప్రారంభిస్తున్న ఏఒ

డ్రోన్తో నానో యూరియా పిచికారీ

ప్రజాశక్తి -నర్సీపట్నం:మండలంలో ధర్మసాగరం గ్రామంలో శనివారం డ్రోన్ ద్వారా నానో యూరియా ఎరువులు పిచికారిపై మండల వ్యవసాయ శాఖ అధికారి విజయలక్ష్మి ఆధ్వర్యంలో జడ్పిటిసి సభ్యురాలు సకల రమణమ్మ ప్రారంభించారు, సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నానో ఎరువును ఏ పంటకైనా పిచికారి చేసుకోవచ్చని, తక్కువ ఖర్చుతో పాటు అధిక దిగుబడులు సాధించుకోవచ్చు అన్నారు, అదేవిధంగా డ్రోన్ తో ఎరువుతో పాటు క్రిమిసంహారక మందులు కూడా పిచికారి చేసుకునే అవకాశం ఉందన్నారు. ఈ ఎరువుతో పైరు ఏపుగా పెరుగుతుందని, అందరూ సద్వినియోగించుకోవాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.


సన్మానిస్తున్న ఎస్ఐ, ఉపాధ్యాయులు

డిఎస్సి ర్యాంకర్లకు సన్మానం

ప్రజాశక్తి -గొలుగొండ:మండలంలోని ఎ.ఎల్.పురం అల్లూరి మైత్రి గ్రంథాలయంలో ఇటీవల డీఎస్సీలో ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సిఐ రేవతమ్మ మాట్లాడుతూ గ్రామం నుండి ఒకేసారి పదుల సంఖ్యలో ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణదేవిపేట ఎస్ఐ వై.తారకేశ్వరావు, గొలుగొండ ఎస్ఐ పి.రామారావు, గ్రంథాలయ ఉపాధ్యాయ సభ్యులు పల్లి సత్యనారాయణ, రాజు, వాసు, టీవీ రమణ, సింగిడి శ్రీను, అచ్చిబాబు పాల్గొన్నారు.

వాసవి క్లబ్ వారోత్సవాలు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు ఇరుకుల రామకృష్ణ ఇచ్చిన పిలుపు మేరకు వాసవి క్లబ్ వారోత్సవాల్లో భాగంగా శనివారం పెదబొడ్డేపల్లి వాసవి క్లబ్, వనిత సౌగంధిని ఆధ్వర్యంలో పాత్రికేయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు ఎస్ జె నరేష్ మాట్లాడుతూ పాత్రికేయులు సమస్యలను వెలుగులోకి తెచ్చి పాలకుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కార మార్గాలను సూచించే గొప్ప బాధ్యతను నిర్వర్తిస్తున్నారన్నారు నిత్యం కష్టాలను లెక్కచేయకుండా, రాత్రింబవళ్ళు శ్రమించి ప్రజలకు పాటుపడుతున్న పాత్రికేయులు నిజంగా ప్రశంసనీయులన్నారు. ఈ కార్యక్రమంలో వాసవి వనిత క్లబ్ సభ్యులు విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



సన్మానిస్తున్న వాసవి క్లబ్ ప్రతినిధులు

గొలుగొండ తహశీల్దారుపై విచారణ చేపట్టాలి

ప్రజాశక్తి-రావికమతం: గొలుగొండ మండల తహసిల్దారు శ్రీనివాసరావు అవినీతి అక్రమాలపై చర్యలు తీసుకొని, ఆయనను తక్షణమే సస్పెండ్ చేయాలంటూ రావికమతం తహసిల్దారు కార్యాలయం వద్ద శనివారం ఆంధ్రప్రదేశ్ ఆదివాసి సంఘం రావిక మతం మండల కన్వీనర్ మోసూరి రాజు,కో కన్వీనర్ తుర్రే రవి ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆదివాసి మండల సంఘం కన్వీనర్ మోసూరి రాజు మాట్లాడుతూ, గొలుగొండ తహసిల్దార్ శ్రీనివాసరావు పాల్పడుతున్న అవినీతి అక్రమాలపై వెంటనే విచారణ అధికారిని నియమించాలన్నారు. గొలుగొండ మండలం పాత మల్లంపేటలో ఆదివాసీల సాగు అనుభవంలో ఉన్న భూములకు ఎలాంటి విచారణ లేకుండా, సాగులో ఉన్న వారికి ఎలాంటి నోటీసు ఇవ్వకుండా రికార్డులను ఏకపక్షంగా తారుమారు చేశారన్నారు. స్పందనలో ఫిర్యాదు లు పెట్టిన ఇవన్నీ తూతూ మంత్రంగానే జరుగుతున్నాయన్నారు. ఆయనను రక్షించేందుకు గాను ఉన్నత స్థాయి అధికారులు తాత్సారం చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రావిక మతం మండలంలోని ఆదివాసీ గ్రామాల రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


ఆందోళన చేపడుతున్న నాయకులు

సిఎం సహాయ నిధి చెక్కుల అందజేత


చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే రాజు

ప్రజాశక్తి: బుచ్చయ్యపేట : మండలంలోని ఐతంపూడి, కరక, వడ్డాది గ్రామాలకు చెందిన బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన చెక్కులను శనివారం చోడవరంలో ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు పంపిణీ చేశారు. కార్యక్రమంలో విశాఖ డెయిరీ డైరెక్టర్ సత్యనారాయణ, టిడిపి మండల అధ్యక్షులు ఎంవివి.సత్యనారాయణ, పిఎసిఎస్ చైర్మన్లు కోట సత్యనారాయణ, దొంకిన అప్పలనాయుడు, గ్రంధాలయ పరిషత్ డైరెక్టర్ సిరిగిరిశెట్టి శ్రీరామ్మూర్తి, మాజీ సర్పంచ్లు తమరాన దాసు, గొలగాన రాజారావు, పడాల గోవింద పాల్గొన్నారు.

రావికమతం:మండలంలో 9 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.6,49,768 నగదు చెక్కులను చోడవరం శాసనసభ్యులు కేఎస్ఎన్ఎస్ రాజు శనివారం లబ్ధిదారులకు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆరు లక్షల 49 వేల 768 రూపాయలను చోడవరం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం అందజేసినట్లు రావిక మతం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కోమటి శంకర్రావు తెలిపారు. వీటిని లబ్ధిదారులు సక్రమమైన రీతిలో సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండలానికి చెందిన మాజీ మండల పార్టీ అధ్యక్షుడు రాజాన కొండ నాయుడు, పలువురు నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని కశింకోట, వెదురుపర్తి గ్రామాలకు చెందిన 18 మంది బాధితులకు సీఎం సహాయ నిధి నుండి మంజూరైన రూ.30.38 లక్షల చెక్కులను రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాక్చర్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ శనివారం లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గొంతిన శ్రీనివాసరావు, వేగి గోపి, సిద్దిరెడ్డి శ్రీనివాసరావు, కాండ్రేగుల సతీష్, కక్కల వెంకట మాజీ సర్పంచ్ పందులు ఎల్లయ్య నాయుడు, రమణ, కృష్ణ, నాగరాజు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వైద్యాధికారి

విద్యార్థులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి -గొలుగొండ:గొలుగొండ డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి శ్యాంకుమార్ మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులకు ఆరోగ్య సమస్యలు పై అవగాహన కల్పించారు. ఆరోగ్యం పట్ల విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కోటేశ్వరరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఉచిత గుండె వైద్య శిబిరం

ప్రజాశక్తి - చీడికాడ: మండల కేంద్రంలో ఈనెల 7న అక్షర శ్రీ విద్యానికేతన్ స్కూల్లో మెగా ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు కరస్పాండెంట్ బి మధు తెలిపారు .ఈ శిబిరంలో ప్రముఖ హృదయ నిపుణులు మీసాల సుజీత్ కుమార్ నాయుడు వైద్య సేవలు అందించనున్నారు. ఈ ఉచిత శిబిరాన్ని గ్రామ ప్రజలు, పరిసర ప్రాంత ప్రజలు తప్పక పాల్గొని ఉచితంగా వైద్య సేవలను పొందాలని ఆయన కోరారు.

జల జీవన్ మిషన్ పనులు ప్రారంభించాలి

ప్రజాశక్తి-రోలుగుంట:రోలుగుంటలో జలజీవన్ మిషన్ పనులు ప్రారంభించి ఇంటింటికి కుళాయిలు ఏర్పాటు చేయాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కె.గోవిందరావు డిమాండ్ చేశారు. మండలం ఫ్లోరైడ్ గ్రామంగా గుర్తించారన్నారు. 2022-2023 సంవత్సరంలో ఇంటింటికి కుళాయిల ఏర్పాటు నిమిత్తం రూ.6 కోట్లు నిధులు మంజూరు చేశారన్నారు. పనులు ప్రారంభించి వదిలేశారని చెప్పారు. అప్పట్లో ఏర్పాటు చేసిన పైపులైన్లు ధ్వంసమయ్యాయన్నారు. ఇక్కడ ఫ్లోరైడ్ బాధితులు అధికంగా ఉన్నారని, కావున తక్షణమే జలజీవన్ మిషన్ పనులు ప్రారంభించి మంచినీటిని అందించాలని కోరారు.

ఉపాధ్యాయిని లక్ష్మికి అభినందనలు

ప్రజాశక్తి: రావికమతం: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మండలంలో కవగుంట ఎంపియుపి పాఠశాల ఉపాధ్యాయిని డివిఎస్ లక్ష్మి రావికమతం మండల ఉత్తమ ఉపాధ్యాయినిగా ఎంపిక కావడం పట్ల కవగుంట గ్రామ సర్పంచ్ దాసరి సూర్య కుమారి వరహాలు, గ్రామ ప్రజలందరూ అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ దాసరి సూర్య కుమారి వరహాలు మాట్లాడుతూ అంకిత భావంతో పని చేసిన ప్రతి ఉద్యోగికి తప్పనిసరిగా గుర్తింపు లభిస్తుందని తెలిపారు. పాఠశాలలో నియమితులైన దగ్గర నుంచి అంకితభావంతో బాధ్యతాయుతంగా పాఠశాల అభివృద్ధి కొరకు, విద్యార్థులకు గుణాత్మకమైన విద్యను అందించడమే లక్ష్యంగా పనిచేసిన వ్యక్తి డి వి ఎస్ లక్ష్మి అని కొనియాడారు.



తనిఖీలు చేపడుతున్న డిప్యూటీ డిఎం హెచ్ఓ

పిహెచ్‌సిలో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి-రోలుగుంట:రోలుగుంట మండలం బుచ్చింపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్ఓ కె.వీరజ్యోతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఆసుపత్రి ఆవరణను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఆసుపత్రి సిబ్బంది పని తీరుపై వైద్యాధికారులు శివప్రసాద్, జానకిలను అడిగి తెలుసుకున్నారు. బయో మెడికల్ వేస్టేజ్‌పై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రోగులకు వైద్య సేవలు ఏవిధంగా అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మరిన్ని మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యాధికారులు శివప్రసాద్, జానకిలకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఈఓ నూకరాజు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు..

9న ఉపకరణాలకు వైద్య శిబిరం

ప్రజాశక్తి- నక్కపల్లి:పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్ష, అలింకో సంస్థ సంయుక్తంగా 0 నుండి 18 సంవత్సరాల లోపు వికలాంగ విద్యార్థులకు ఉచిత ఉపకరణాలు పంపిణీకి గుర్తింపు వైద్య నిర్ధారణ శిబిరం ఈనెల 9వ తేదీ మంగళవారం ఉదయం 9 గంటల నుండి పాయకరావుపేటలో సమయమంతుల రెడ్డి ప్రభుత్వ హైస్కూల్లో నిర్వహించనున్నట్లు ఎంఇఒలు కె నరేష్, ఆర్ నాగేంద్ర దొర, గొడిచెర్ల ఉన్నత పాఠశాల ప్రత్యేక ఉపాధ్యాయురాలు షేక్ యాస్మీన్,భవిత ఉపాధ్యాయులు గౌరీ శనివారం తెలిపారు. శారీరక వైకల్యం గల విద్యార్థులకు మోటరైజ్డ్ బ్యాటరీ ట్రై సైకిల్, వీల్ చైర్లు, ట్రై సైకిల్ సిపి చైర్లు, రొలేటర్స్, వాకర్స్, వినికిడి లోపం గల విద్యార్థులకు వినికిడి యంత్రాలు, దష్టిలోపం ఉన్నవారికి బ్రెయిలీ కిట్స్, మేధో వైకల్యం వారికి ఎంఆర్ కిట్స్ ఉచితంగా అందించడానికి ఈ శిబిరం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.కోటరట్ల, ఎస్ రాయవరం, నక్కపల్లి, పాయకరావుపేట మండలాలకు చెందిన విద్యార్థులు హాజరు కావాలన్నారు. శిబిరానికి వచ్చే వారు సదరం సర్టిఫికెట్, యూడి ఐడి కార్డు, రేషన్ కార్డు/ ఆదాయ ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు జెరాక్స్ కాపీలు, 2 పాస్ పోర్టు సైజ్ ఫోటోలు తీసుకొని రావాలని సూచించారు.

రోడ్డు మరమ్మతు చేపట్టాలి

సిపిఎం ఆధ్వర్యాన వినూత్న నిరసన

ప్రజాశక్తి: రావికమతం: మండలంలో కొత్తకోట పెట్రోల్ బంకు వద్ద భారీ గొయ్యిలు ఏర్పడడంతో శనివారం సిపిఎం ఆధ్వర్యంలో వినూత్నంగా చేపలు పట్టే నిరసన కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది.

ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కే గోవిందరావు మాట్లాడుతూ నల్లరాయి, గ్రానైట్ భారీ వాహనాలతో రోడ్డు పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంటున్నాయని వాటిపైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. బిఎన్ రోడ్డులోఇప్పటికే రెండు బ్రిడ్జిలు కూలిపోయాయన్నారు. కొత్తకోటలో కూడా బ్రిడ్జి కూలిపోవడానికి సిద్ధంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే బి ఎన్ రోడ్డు పనులు మొదలు పెడతామని, గత ఎన్నికల్లో గెలుపొంది ప్రజాప్రతినిధులు వాటి వంక చూడకపోవడం చాలా విడ్డూరమన్నారు. ఇప్పటికైనా ఎంపీ, ఎమ్మెల్యేలు రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి కాంట్రాక్టర్ చేసిన రోడ్డు పనులు బిల్లులు చెల్లించి, పనులు మొదలు పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎస్ .వలసయ్య, పాడి బెన్నయ్య, సిపిఐ మండల కార్యదర్శి జోగిరాజు, గిరిజన సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



గోతుల రహదారిపై చేపలు పడుతూ ఆందోళన చేపడుతున్న సిపిఎం నేతలు

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు


ప్రజాశక్తి- నక్కపల్లి:నక్కపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా శనివారం భారతదేశంలో అందరికీ అక్షరాస్యత ఆవశ్యకత అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు.వయోజన అక్షరాస్యత ఏడి చిన్నకృష్ణ, ఎంఈఓ నాగన్న దొర పర్యవేక్షించారు.



వ్యాసరచన రాస్తున్న విద్యార్థులు

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి- నక్కపల్లి:నక్కపల్లిలో కొత్తపేట కృష్ణా క్లబ్ ఆవరణలో సిద్ధి వినాయక ఉత్సవ సంఘం ఆధ్వర్యంలో గణపతి నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి నిర్వహించిన ముగ్గులు పోటీలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. పలువురు మహిళలు పోటాపోటీగా ఎంతో ఉత్సాహంతో ముగ్గుల పోటీల్లో పాల్గొన్నారు.ఈ పోటీలకు న్యాయనిర్ణేతగా తెలుగు ఉపాధ్యాయులు ఎస్.వి.ఎస్.ఆచార్యులు వ్యవహరించారు. ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను కైవసం చేసుకున్న వారితో పాటు,ముగ్గుల పోటీలలో పాల్గొన్న వారందరికీ ప్రోత్సాహక బహుమతులను ఉత్సవ కమిటీ సభ్యులు చేతుల మీదుగా అందజేశారు.



బహుమతులు ఇస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

ట్రంప్ సుంకాలపై వామపక్షాల నిరసన



విశాఖలో నిరసన తెలుపుతున్న సిపిఎం, సిపిఐ నాయకులు, కార్యకర్తలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన సుంకాలను వ్యతిరేకిస్తూ విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద సిపిఎం, సిపిఐ ఆధ్వర్యాన శనివారం నిరసన తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.కృష్ణారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.రెహ్మాన్, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.మణి మాట్లాడారు. అమెరికాలో భారతీయ సరుకుల దిగుమతిపై 50 శాతం సుంకాలు విధించడాన్ని వామపక్ష పార్టీలు తీవ్రంగా ఖండిస్తున్నాయన్నారు. ఆ సుంకాలను తక్షణమే రద్దు చేయాలని, సుంకాలపై కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వాల వైఖరి వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఆ సుంకాల వల్ల భారతీయ వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులపై తీవ్ర ప్రభావం పడుతోందన్నారు. నేటికీ మోడీ, చంద్రబాబు, పవన్‌లు నోరు మెదపకపోవడాన్ని దుయ్యబట్టారు. ట్రంప్ సుంకాలతో ఆక్వా పరిశ్రమతో పాటు టెక్స్‌టైల్స్, గార్మెంట్స్ రంగాలు తీవ్ర సంక్షోభంలోకి నెట్టబడుతున్నాయన్నారు. ఇంత జరుగుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ట్రంప్‌నకు దాసోహం కావడం సిగ్గుచేటన్నారు. తక్షణమే దేశ ప్రయోజనాలను, సార్వభౌమత్వాన్ని కాపాడే విధంగా స్పందించాలన్నారు. కార్యక్రమంలో వామపక్ష పార్టీల నాయకులు ఎం.పైడిరాజు, ఎం.సుబ్బారావు, ఎం.మన్మధరావు, దేవా, పట్నాయక్, రెడ్డి, క్షేత్రపాల్, కొండమ్మ, వెంకటరావు పాల్గొన్నారు.

అనకాపల్లి : భారతదేశం నుండి అమెరికాకు ఎగుమతయ్యే వ్యవసాయ తదితర ఉత్పత్తులపై ఆ దేశ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ విధించిన 50 శాతం టారిఫ్‌లపై అనకాపల్లి నెహ్రూ చౌక్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద సిపిఐ, సిపిఎం ఆధ్వర్యాన శనివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు మాట్లాడుతూ గతంలోని ఎప్పుడు లేని విధంగా అమెరికా అధ్యక్షుడు నియంతృత్వ ధోరణితో భారత్ ఎగుమతులపై 50శాతం సుంకాలు విధించడం దారుణమన్నారు. సిపిఎం నాయకులు పెంటకోట శ్రీనివాసరావు మాట్లాడుతూ అమెరికా దురహంకార సామ్రాజ్యవాదాన్ని ప్రపంచ దేశాలన్నీ తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ, సిపిఎం నాయకులు రాజాన దొరబాబు, తాకాసి వెంకటేశ్వరరావు, వైఎన్.భద్రం, వియ్యపు రాజు, కోరిబిల్లి శంకర్రావు, ముక్కామల చిన్ని, గండేపల్లి చిరంజీవి, హరీష్, సూరిబాబు, బాబ్జి, పోతురాజు, బుగిడి నూకప్పారావు పాల్గొన్నారు.

కైరళిలో ఘనంగా ఓనం

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండల కేంద్రం దేవరాపల్లిలోని కైరళి ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రాంగణం శనివారం కేరళ రాష్ట్రానికి ప్రతీకగా నిలిచే ఓనం పండుగను వైభవంగా నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు కేరళ సంప్రదాయ వేషధారణలో మెరిసిపోగా, మలయాళీ జానపద గీతాలకు విద్యార్థులు చేసిన నృత్యాలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. పూలతో అలంకరించిన రకరకాల ముగ్గులు పాఠశాల వాతావరణాన్ని మరింత ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాయి. ముఖ్య అతిథిలుగా హాజరైన ఎంఇఒ ఉమ, ఎస్సై వి.సత్యనారాయణ విద్యార్థుల ప్రతిభను అభినందించారు. కార్యక్రమంలో కైరళి పాఠశాల కరస్పాండెంట్ ఎన్‌కె.దినేష్ తదితరులు పాల్గొన్నారు.



ఓనం ఉత్సవాల్లో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఆవఖండం పరిరక్షణకు పోరాటం

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : ఆవఖండం పరిరక్షణకు పోరాటం చేస్తామని ఆవఖండం పరిరక్షణ సమితి సభ్యులు తెలిపారు. స్థానిక సిపిఐ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో పరిరక్షణ వేదిక కన్వీనర్లు వైఎన్.భద్రం, గాడి బాలు మాట్లాడుతూ మూడు నెలల క్రితం అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఆవఖండంలో అక్రమాలను అడ్డుకుంటామని ఇచ్చిన ప్రకటనతో వేచి చూశామని, అయినా ఆగకుండా విఎంఆర్‌డిఎ ప్లాన్‌కు విరుద్ధంగా పనులు జరుగుతున్నాయని తెలిపారు. తక్షణమే చర్యలు తీసుకోకపోతే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కనిశెట్టి సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.